

సోమశిలలో పెరుగుతున్న నీటిమట్టం



అనంతసాగరం: సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహంతో నీటి నిల్వ 20 టీఎంసీలు దాటింది. బుధవారం 8,427 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 20.343 టీఎంసీలకు చేరుకుంది. దిగువ డెల్టా, ఉత్తర, దక్షిణ కాలువలకు 210 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.



నెల్లూరు: పోలీస్ కవాతు మైదానంలో రూపుదిద్దుకున్న వేదిక

స్వేచ్ఛా.. సంక్షేమం
అదే ఆకాంక్ష!

గతానికి భిన్నమైన వాతావరణం కోరుకుంటున్న జనం

ఈ స్వాతంత్ర్య దినోత్సవం వెదజల్లాలి స్వేచ్ఛా సుగంధం...!!!

- ఐదేళ్లపాటు వణికిపోయిన సామాన్య జనం
- సహజ వనరుల దోపిడీ.. రక్షణ కరువు

కన్యాశుల్కం నాటకంలో మనకు స్వాతంత్ర్యం వచ్చిందంటూ గొప్పగా చెబుతాడు గిరీశం పాత్రధారి. స్వాతంత్ర్యం వల్ల జరగబోయే అభివృద్ధిపై పెద్దగా ఉపన్యాసం ఇస్తాడు.

ఇదంతా విన్న దర్జీ (టైలర్) అవన్నీ పక్కనపెట్టు కానీ.... స్వాతంత్ర్యం వచ్చిందన్నావు కదా..! అయితే మన ఊరి హెడ్ కానిస్టేబుల్ మారిపోతాడా..!!!? అని ప్రశ్నించాడు. అతని ప్రపంచానికి ఆ ఊరి పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబులే ప్రధాన సమస్య.

స్వాతంత్రానికి పూర్వం రచించిన ఈ నాటకంలో దర్జీ (టైలర్) ప్రశ్న బ్రిటీష్ కాలంలో పోలీస్ దాష్టికానికి అద్దం పడుతుంది.

గత ఐదేళ్ల పాలనలో ప్రజలు ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొన్నారు. ప్రభుత్వం మారిన క్రమంలో కన్యాశుల్కం నాటకంలోని టైలర్ కోరుకున్నట్లే తమ ఊరి పోలీసులు మారిపోతే చాలు అని ఆశపడ్డారు. బ్రిటీష్ పాలన ఎలా ఉండేదో చెప్పే ప్రత్యక్ష సాక్షులు ఇప్పుడు ఉండకపోవచ్చుగానీ గత పాలనలో చాలా మంది బ్రిటీష్ పాలనే నయం అంటూ గుసగుస లాడుకున్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలోగానీ, సహజ వనరుల దోపిడీ విషయంలోగానీ, పరదాల చాటున తిరిగిన రాష్ట్రాధినేత విషయంలోగానీ చాలా విషయాల్లో బ్రిటీష్ పాలనను గుర్తు చేసుకున్నారు. అందుకు భిన్నమైన వాతావరణం కోరుకున్నారు.

స్వాతంత్ర్య పోరాటానికి స్ఫూర్తి స్వేచ్ఛ. స్వాతంత్ర్య నినాదం స్వేచ్ఛ. అయితే గడచిన ఐదేళ్ల పాలనలో కేవలం కొద్ది మంది మినహా మిగిలిన వారందరూ బిక్కుబిక్కుమంటూనే బతికారు. ప్రజల రక్షణ కోసం ఏర్పాటు చేసిన పోలీసు స్టేషన్లు ఆ నాటి అధికార పార్టీ నేతల అతిథి గృహాలుగా మారిపోయాయి. పేరుకు పోలీసులేగానీ పెత్తనమంతా అధికార పార్టీ నాయకులే చలాయించారు. పోలీసుల చేతిలోని లాఠీ న్యాయాన్యాయాల విచక్షణ మరిచిపోయింది. చట్టాలు వైసీపీ నాయకుల ప్రయోజనాలకు అనుగుణంగా మారిపోయాయి. రాజకీయ కక్షలు పెచ్చుమీరాయి. బలహీనుల ఆస్తులు ఆక్రమణకు గురయ్యాయి. పాలకుల మెప్పు కోసం ఎంతో మంది సామాన్యుల ప్రాణాలను బలితీసుకున్న పాపాన్ని పోలీసులు మూటకట్టు కున్నారు.

సహజ వనరుల దోపిడీ

200 ఏళ్ల బ్రిటీష్ పాలనలో దేశ సంపద దోపిడీ జరిగిందని చరిత్ర పాఠ్యాంశాల్లో చెబుతారు. అది ఎంత వరకు నిజమో తెలియదుగానీ గత ఐదేళ్ల కాలంలో జరిగిన సహజ వనరుల దోపిడీని మాత్రం ప్రజలు కళ్లారా చూశారు. ఈ క్రమంలో మరోసారి బ్రిటీష్ పాలనను గుర్తుకు తెచ్చుకున్నారు. సగటు మనిషికి గంపెడు ఇసుక దొరకలేదుగానీ వైసీపీ నాయకులు మాత్రం టిప్పర్ల కొద్దీ ఇసుకను పక్క రాష్ట్రాలకు తరలించి కోట్లు సంపాదించు కున్నారు. కొత్త పాలసీలతో రాష్ట్రంలోని ఇసుక, సిలికా నిక్షేపాలను కావాల్సిన వారికి దారాదత్తం చేసుకున్నారు. అక్రమ మైనింగ్‌తో కొండలు, గుట్టలను కొల్లగొట్టారు. జగనన్న లే అవుట్ల పేరుతో మట్టి దిబ్బలను నిలువునా మింగేశారు. ప్రజల కళ్లముందే నిరాటంకంగా సాగిన ఈ ఐదేళ్ల దోపిడీని చూసిన ప్రజలు బ్రిటీష్ పాలననే గుర్తుకు తెచ్చుకున్నారు.

దొరతనం ఛాయలు

బ్రిటీష్ పాలనలో దొరల దర్శనం సామాన్యులకు దుర్లభం. ప్రజాస్వామ్య యుగంలో సైతం రాష్ట్ర ప్రజలు అలాంటి పరిస్థితులనే ఎదుర్కొన్నారు. నాలుగున్నరేళ్లపాటు రాష్ట్రాధినేత ప్రజలకు దూరంగానే గడిపారు. ప్రజలకే కాదు, ఎమ్మెల్యేలకు కూడా ఆయన దర్శనం ఉండదు. క్యాబినెట్ సమావేశంలో నోరు మెదిపే స్వాతంత్ర్యం లేక మంత్రులు మౌనమునుల అవతారం ఎత్తారు. ఎవరి అభిప్రాయానికీ విలువలేదు. తను ఒక దైవాంశ సంభూతునిగా, తను చెప్పిందే వేదంగా రాష్ట్రాధినేత పాలన సాగించారు. రాజ్యాంగం ప్రసాదించిన హక్కుల్లో భావ ప్రకటన స్వేచ్ఛ అతి ముఖ్యమైనది. దురదృష్టం ఏమంటే గడచిన ఐదేళ్ల కాలం ప్రజల చేత ఎన్నుకోబడిన ఎమ్మెల్యేలు, ఎంపీలకే ఆ హక్కు లేకుండా పోయింది. ఒక్క మాటలో చెప్పాలంటే బ్రిటీష్ పాలన కంటే మిన్నగా నియంత పోకడల మధ్య రాష్ట్ర ప్రజానికం నలిగిపోయింది.

ప్రజల ఆకాంక్షాలు నెరవేరాలి

భయానక వాతావరణం... విచ్చలవిడి దోపిడీ విధానం... నిరంకుశ మనస్తత్వాల మధ్య నలిగిపోయిన ప్రజలు నిజమైన ప్రజాస్వామ్య పాలన కోసం ఉద్యమించారు. ఎన్నికల ద్వారా చరిత్రాత్మక తీర్పు నిచ్చారు. రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్య వాతావరణం కోసం కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారు. వారి ఆకాంక్షలను నెరవేర్చాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉంది. అధికారంలోకి వచ్చామన్న అత్యుత్సాహమో లేక పాత సీసాలోకి వచ్చిన కొత్త సారా నైజమో... అక్కడక్కడా అప్పుడే తప్పటడుగులు పడుతున్నాయి. ప్రజల ఆకాంక్షలకు విరుద్ధమైన సంఘటనలు చోటు చేసుకొంటున్నాయి. ప్రతీకారాల పేరిట గత పాలకులు చేసిన తప్పులు కొన్నిచోట్ల పునరావృతం అవుతున్నాయి. సగటు మనిషికి ఎమ్మెల్యేలు కనిపించని విధం గా ఫైరవీకారుల కోటరీలు ఏర్పడుతున్నాయి. కూటమి ప్రభుత్వం వీటన్నింటిని అధిగమించా లని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. పోలీసు స్టేషన్లు సగటు మనిషి పాలిట దేవాలయాలు కావాల ని కోరుకొంటున్నారు. సహజ వనరులు భావితరాల భవిష్యత్తు కోసం వినియోగించబడాలని ఆశిస్తున్నారు. సంక్షేమంతోపాటు గ్రామగ్రామాన అభివృద్ధి కనిపించాలని ఆకాంక్షిస్తున్నారు. ఈ స్వాతంత్ర్య దినోత్సవం నిజమైన ప్రజాస్వామ్య పాలనకు నాంది పలకాలని అభిలషిస్తున్నారు.

\- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

78వ స్వాతంత్ర్య వేడుకలకు
సర్వం సన్నద్ధం



రాపూరులో భారీ త్రివర్ణ పతాకంతో విద్యార్థుల ర్యాలీ



బుచ్చిలో 300 అడుగుల జాతీయ జెండాతో ప్రదర్శన



వెంకటాచలం : విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న వీఎస్‌యూ వీసీ విజయభాస్కరరావు

నెల్లూరు (ఆంధ్రజ్యోతి): ఎన్నో పోరాటాలకు ఆరంభ వేదిక.. మరెందరో మహానుభావులకు పురిటిగడ్డ.. సింహపురి సీమ. స్వాతంత్రోద్యమంలో కీలక పాత్ర పోషించిన సింహపురి గడ్డ గురువారం 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముస్తాబైంది. జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలన్నీ విద్యుద్దీపాలంకరణలతో కళకళలాడుతున్నాయి. నెల్లూరులోని పోలీసు కవాతు మైదానంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అట్టహాసంగా జరగనున్నాయి. ఇందుకు సంబంధించి ఏర్పాట్లను ఘనంగా చేశారు. ఉదయం 9 గంటలకు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ పోలీసు పరేడు మైదానంలో జాతీయ జెండాను ఎగరవేయనున్నారు. అనంతరం పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించి, విధి నిర్వహణలో విశిష్ట సేవలందించిన 61 ప్రభుత్వ శాఖల్లోని 463 మంది ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేస్తారు. వివిధ శాఖలు తమ ప్రగతిని తెలియజేస్తూ శకటాలను ప్రదర్శించనున్నాయి. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో గురువారం రాత్రి కస్తూర్బా కళాక్షేత్రంలో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. కాగా పోలీసు పరేడు మైదానంలో స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ బుధవారం పరిశీలించారు. అలాగే ఎస్పీ కృష్ణకాంత్ కూడా మైదానాన్ని పరిశీలించి, పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఉదయం 7.30 గంటలకు కలెక్టర్ జెండాను ఎగురవేయనున్నారు. కాగా, హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా విద్యార్థులు త్రివర్ణపతాకాలను చేతబూని ర్యాలీలు నిర్వహించారు.

రంగనాథుడికి
తిరుమంజనం



నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 14 : తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం తిరుమంజన సేవ కనుల పండువగా జరిగింది. అనంతరం మహాకుంభా రాధన, నిత్యహోమాలు, పవిత్ర ప్రతిష్ఠ, పవిత్ర సమర్పణ జరిగాయి. ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈవో అర్వభూమి వెంకట శ్రీనివాసులు పర్యవేక్షించారు. ఆలయంలో గురువారం ఉదయం 9.30గంటలకు జెండా వందనం జరుగుతుందని ఈవో తెలిపారు.

కొత్త జేసీ కార్తీక్



నెల్లూరు (వ్యవసాయం) : జిల్లా జాయింట్ కలెక్టర్‌గా కే.కార్తీక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం జిల్లా జేసీగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన నెల్లూరుకు వచ్చారు. బుధవారం ఉదయం కలెక్టర్ వద్ద డీఆర్వో లవన్న నూతన జేసీకి స్వాగతం పలికారు. అనంతరం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్ర మాల అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తానని, జిల్లా అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

విద్యుత్ శాఖకు బెస్ట్ సర్కిల్ అవార్డు

నెల్లూరు (జడ్పీ) : స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ ప్రకటించిన బెస్ట్ సర్కిల్ అవార్డును నెల్లూరు విద్యుత్తు శాఖ దక్కించుకుంది. నాణ్యమైన కరెంటు సరఫరా, సేవలు తదితర అంశాలలో ఇతర జిల్లాలకంటే నెల్లూరు ప్రథమ స్థానంలో ఉన్నట్టు ఆ సంస్థ ప్రకటించింది. బెస్ట్ డివిజన్ అవార్డును కావలి, అతితక్కువ అంతరాయాలు ఉన్న డివిజన్‌గా నెల్లూరురూరల్, డెవలప్‌మెంట్ చార్జీల వసూళ్ళలో నెల్లూరు డివిజన్ ప్రత్యేక అవార్డులు దక్కించుకున్నాయి. ఎస్ఈ విజయన్ నేతృత్వంలో ఈ అవార్డులు దక్కడంతో బుధవారం ఆయన్ను అధికారులు, ఉద్యోగులు, యూనియన్ నేతలు ప్రత్యేకంగా అభినందించారు.

అమ్మా నాన్న సారీ..
ఈ టార్చర్ భరించలేను!

- మాధవనగర్‌లో యువకుడి ఆత్మహత్య
- మృతుడికి మూణ్నెళ్ల క్రితమే ప్రేమవివాహం
- అంతలోనే మనస్పర్థలు.. పుట్టింటికి వెళ్లిన భార్య
- సెల్ఫీ వీడియో తీసుకుని భర్త బలవన్మరణం



మృతుడు హరీష్ (ఫైల్)

వింజమూరు, ఆగస్టు 14 : 'అమ్మానాన్న నన్ను క్షమించండి. ఈ టార్చర్ నేను భరించలేను. నేను చనిపోవాలనుకుంటున్నా. అందరికీ సారీ.' అంటూ వింజమూరు మండలంలో ఓ యువకుడు సెల్ఫీ వీడియో తీసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. గ్రామస్థుల కథనం మేరకు.. మండలంలోని మాధవ్‌నగర్‌కు చెందిన బ్రహ్మయ్య, ప్రభావతిల కుమారుడు హరీష్ (25), అదే గ్రామానికి చెందిన ఓ యువతి మూడు నెలల క్రితం ప్రేమపెళ్లి చేసుకున్నారు. అయితే, ఇంత లో ఏం జరిగిందో ఏమో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు తలెత్తాయి. దీంతో నెల రోజుల క్రితం ఆ యువతి పుట్టినింటికి వెళ్లిపోయింది. రోజులు గడుస్తున్నా భార్య కాపురానికి రాకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురైన హరీష్ తన మనోవేదనను సెల్ఫీ వీడియోలో వ్యక్తపరిచాడు. అనంతరం ఇంటిలో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బుధవారం సాయంత్రం గ్రామంలో బంధువులు అశ్రునయానాల నడుమ యువకుడి అంత్యక్రియలు జరిగాయి. కాగా, ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ కోటిరెడ్డి తెలిపారు.

వ్యవసాయంలో కీలకమైన సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సమాయత్తమవుతోంది. గడిచిన ఐదేళ్లుగా సాగునీటి సంఘాల పాలకవర్గాలు లేక రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతోంది. అధికారులే ఇన్‌చార్జ్‌లు కావడంతో క్షేత్రస్థాయి సమస్యలను పట్టించుకునేవారు కరువయ్యారు. కనీసం పలానా కాలువలో పూడిక తీయాలి అని బాధ్యత తీసుకున్నవారు కూడా లేరు. ఈ నేపథ్యంలో వీలైనంత త్వరగా సాగునీటి సంఘాలకు పాలకవర్గాలను నియమించి రైతాంగానికి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎన్డీయే ప్రభుత్వం యోచిస్తోంది. ఈ క్రమంలో సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి వివరాలను పంపాలని జిల్లా ఇరిగేషన్ అధికారులను ఆదేశించింది. ఎన్నికల నిర్వహణకు ఏవైనా ఆటంకాలు ఉన్నాయా..? ఒకవేళ అటువంటి పరిస్థితి ఉంటే నామినేటెడ్ కమిటీలను ఏర్పాటు చేయాలా..? అన్న అంశాలపై ప్రభుత్వం ఉన్నతాధికారులతో సమీక్షిస్తోంది.

- జిల్లా నుంచి వివరాలు సేకరించిన ప్రభుత్వం
- జిల్లాలో ఐదు పీసీలు, 13 డీసీలు, 765 డబ్ల్యూఏలు
- త్వరలో నోటిఫికేషన్ వెలువరించే అవకాశం
- ఐదేళ్లుగా పాలకవర్గాలు లేక రైతాంగానికి అవస్థలు
- శిస్తు వసూలు లేదు.. కాలువల్లో పూడిక తీయలేదు

సాగునీటి సంఘాల
ఎన్నికలకు సమాయత్తం

నెల్లూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి యాజమాన్యంలో నీటి సంఘాలది కీలకపాత్ర. ఆయా గ్రామాలు, కాలువల పరిధిలో నీటి వృథా జరగకుండా ప్రతి ఎకరాకు నీటిని అందించేలా ఈ సంఘాలు కృషి చేస్తుంటాయి. అటువంటి సంఘాలకు వైసీపీ ప్రభుత్వంలో ఎన్నికలు నిర్వహించకపోగా కనీసం నామినేటెడ్ కమిటీలను కూడా వేయలేదు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలోని సాగునీటి సంఘాల వివరాలను ఇరిగేషన్ అధికారులు రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపారు. ప్రభుత్వం సూచించిన ప్రొఫార్మా ప్రకారం మూడు రోజుల క్రితం వివరాలన్నీ రాష్ట్ర జలవనరుల శాఖకు చేరాయి.

జిల్లాలో రెండు మేజర్ ప్రాజెక్టు కమిటీలు సోమశిల, పెన్నా డెల్టాలు ఉన్నాయి. ఈ రెండింటికి సోమశిల ఎస్ఈ, రెగ్యులర్ ఇరిగేషన్ ఎస్ఈలు ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. అలానే మరో మూడు మీడియం ప్రాజెక్టు కమిటీలు గండిపాలెం ప్రాజెక్టు, కనుపూరు కెనాల్, స్వర్ణముఖి ఆయకట్టు సిస్టమ్ ఉన్నాయి. వీటితోపాటు 13 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 765 చిన్న తరహా సాగునీటి సంఘాలు ఉన్నాయి. డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఇన్‌చార్జ్‌లుగా ఉండగా, చిన్న తరహా సాగునీటి సంఘాలకు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్థాయి అధికారులు ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తున్నారు.

కమిటీల్లేకుండా కాలయాపన

సాగునీటి సంఘాలకు చాలా కాలం నుంచి ఎన్నికలు జరగలేదు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వంలో కూడా ఎన్నికలకు ఇబ్బందులు ఉండటంతో అప్పటి ప్రభుత్వం రైతు ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ప్రతి సంఘానికి నామినేటెడ్ కమిటీని నియమించింది. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నీటి సంఘాలను గాలికొదిలేసింది. టీడీపీ ప్రభుత్వం నియమించిన కమిటీలను రద్దు చేసి ఆ బాధ్యతలను ఇరిగేషన్ ఇంజనీర్లకు అప్పగించింది. కమిటీలను రద్దు చేసినంత స్పీడు కొత్త కమిటీలను నియమించడంలో వైసీపీ ప్రభుత్వం చూపలేదు. ఐదేళ్లపాటు అటు ఎన్నికలు జరపక, ఇటు నామినేటెడ్ కమిటీలను నియమించకుండా సాగును నిర్లక్ష్యం చేసింది. దీంతో రైతులు ఏ కాలువలో, ఏ తూములో సమస్య వచ్చినా డివిజన్ కేంద్రానికి వచ్చి అధికారులకు చెప్పుకోవాల్సి వచ్చింది. అదే సమయంలో కాలువలపై కీలకంగా వ్యవహరించే లస్కర్లను కూడా తొలగించడంతో రైతాంగం పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.

ఐదేళ్లు నేతల చేతుల్లోనే!

నీటి సంఘం పరిధిలోని ఏ కాలువలో పనులు చేయాల్సి ఉన్నా ఆ సంఘం పాలకవర్గమే చూసుకునేది. ఈ సంఘాలకు ఆర్థిక లావాదేవీలు చేసే అధికారం కూడా ఉంది. ఈ సంఘంలోని సభ్యులంతా స్థానికులు కావడంతో వారు బాధ్యతగా వ్యవహరించేవారు. రైతులకు ఏ సమస్య వచ్చినా వెంటనే వీరి దృష్టికి తెచ్చేవారు. రైతులు చెల్లించే శిస్తును ఈ సంఘాలకు జమ చేసి తద్వారా కాలువల్లో అభివృద్ధి పనులు చేసేవారు. కానీ గడిచిన ఐదేళ్లుగా శిస్తు వసూలు చేసేవారు కూడా లేకుండా పోయారు. ప్రస్తుతం జిల్లాలో రూ.50 కోట్ల వరకు శిస్తు వసూలు చేయాల్సి ఉంది. ఈ ప్రభావం నీటి యాజమాన్యంపై తీవ్రంగా పడుతోంది. కాలువల్లో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనులను సాగునీటి సంఘాల ద్వారా చేపడుతుంటారు. వీరంతా రైతులు కావడంతో పనులన్నీ పక్కాగా చేయించేవారు. కానీ గడిచిన ఐదేళ్లుగా ఈ సంఘాలు లేకపోవడంతో ఓఅండ్ఎం పనులను టెండర్లు ద్వారా దక్కించుకున్న వైసీపీ నేతలు పనులు చేయకుండానే బిల్లులు తినేశారు.

వివరాలు పంపాం

సాగునీటి సంఘాల వివరాలు వెంటనే పంపాలని రాష్ట్ర ఉన్నతాధికారులను ఆదేశాలు వచ్చాయి. జిల్లాలో ఉన్న ప్రాజెక్టు కమిటీలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, డబ్ల్యూఏల వివరాలన్నీ పంపాం. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

\- పీ కృష్ణమోహన్, ఇరిగేషన్ ఎస్ఈ

విద్యుత్ బిల్లు చెల్లించలేదంటూ టోకరా
ఉపాధ్యాయుడి ఖాతా నుంచి రూ.64 వేలు స్వాహా

కలువాయి: 'మీరు ఈనెల కరెంటు బిల్లు చెల్లించలేదు.. మీ సర్వీసును తొలగిస్తాం' అంటూ ఓ ఉపాధ్యాయుడి ఫోన్‌కు గుర్తు తెలియని వ్యక్తి మెసేజ్ పంపాడు. అంతేకాక అతడి బ్యాంకు ఖాతా నుంచి రెండు దఫాలుగా రూ.64వేలు కాజేశాడు. ఈ సంఘటన బుధవారం కలువాయిలో చోటుచేసు కుంది. పోలీసుల కథనం మేరకు, కలువాయి మండలం చీపినాపి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వీ.నారాయణరావు ఫోన్‌కు 'మీరు ఈనెల కరెంట్ బిల్లు చెల్లించలేదు' అంటూ ఓ వ్యక్తి మెసేజ్ పంపాడు. వెం టనే ఆ ఉపాధ్యాయుడు కాల్ చేసిన వ్యక్తికి ఫోన్ చేసి నేను బిల్లు చెల్లించానని తెలిపారు. అయితే మీరు చెల్లించనట్లు చూపిస్తుందని.. నేను ఒక యాప్ పంపిస్తాను దాన్ని అప్‌డేట్ చేసుకోవాలని ఆ వ్యక్తి చెప్పాడు. వెంటనే ఆ వ్యక్తి ఉపాధ్యాయుడికి యాప్ పంపాడు. ఆ టీచర్ కూడా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నాడు. దీంతో ఉపాధ్యాయుడి ఫోన్ అవతలి వ్యక్తి స్వాధీనంలోకి వెళ్లిపోవడంతో ఓ సారి రూ.49 వేలు, మరోసారి 15 వేలు బ్యాంకు ఖాతా నుంచి కట్ అయ్యాయి. దీంతో తాను మోసపోయాయని గ్రహించి ఆ ఉపాధ్యాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



చీమల దేశభక్తి

ఆవగింజంత త్రివర్ణపతాకం చుట్టూ చీమలు చక్కర్లు కొడుతూ అబ్బురపరిచాయి. నెల్లూరులోని ఈ దృశ్యాలను ఆంధ్రజ్యోతి తన కెమెరాలో బంధించింది.



లవంగంపై సూక్ష్మ త్రివర్ణ పతాకం

లవంగం గింజపై నిలబడేంత సూక్ష్మ త్రివర్ణ పతాకాన్ని సూక్ష్మ కళాకారుడు ఆలూరు రాముఆచారి రూపొందించి బుధవారం ప్రదర్శించాడు. ఈ సందర్భంగా మండల ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపాడు.

- మనుబోలు

అప్పడంపై..

అప్పడంపై జాతీయ జెండా సూక్ష్మ చిత్రాన్ని తీర్చిదిద్ది స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు సుబ్బారెడ్డిపాలెం ప్రాథమికోన్నత పాఠశాల తెలుగు పండిట్ సోమా పద్మారత్నం. ఎందరో వీరుల త్యాగఫలితంగా స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు.



- ముత్తుకూరు

చదువుతూనే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

● కలెక్టర్ ఆనంద్ ● అంబేడ్కర్ విద్యాజ్యోతి ఉపకార వేతనాల పంపిణీ

నెల్లూరు (వ్యవసాయం) : చదువుకుంటూనే జీవితంలో ఎలా స్థిరపడాలనే విషయంలో లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని కలెక్టర్ ఆనంద్ విద్యార్థులకు సూచించారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 5 నుంచి 10వ తరగతి వరకు చదువుతూ ప్రతిభ కనబర్చిన ఎస్సీ, ఎస్టీ బాలికలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యాజ్యోతి స్కాలర్‌షిప్పు పథకం పేరుతో కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో అందిస్తున్న ఉపకారవేతనాల పంపిణీ కార్యక్రమం బుధవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా చదువును ఆపవద్దని సూచించారు. లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీకాంత్ ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమం కింద 2013 నుంచి కెనరా బ్యాంకు స్కాలర్‌షిప్పులు అందిస్తోందని చెప్పారు. రూరల్, సెమీ అర్బన్, అర్బన్ ప్రాంతాల్లోని 52 పాఠశాలల నుంచి 312 మంది ప్రతిభావంతులను ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం రూ.12.48లక్షలను ఉపకారవేతనంగా అందిస్తున్నామన్నారు. కెనరా బ్యాంకు రీజినల్ మేనేజరు నాగరాజు మాట్లాడుతూ 1,39,742 మంది విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్పు ద్వారా ప్రయోజనం పొందారని చెప్పారు. అనంతరం డీబీటీ విధానంలో స్కాలర్‌షిప్పు బదిలీ కోసం రూ.12.48 లక్షల చెక్కును కలెక్టర్ విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో రామారావు, సర్వశిక్ష పీవో ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ ఆనంద్

అగ్రిగోల్డ్, ప్రభుత్వ భూముల్లోని జామాయిల్ అక్రమంగా నరికివేత

రూ.లక్షలు స్వాహా చేస్తున్న అక్రమార్కులు

పట్టించుకోని అధికార యంత్రాంగం



ప్రభుత్వ భూముల్లో నరికిన జామాయిల్

ఉదయగిరిలోనూ వీరప్పన్

ఉదయగిరి రూరల్, ఆగస్టు 14 : వీరప్పన్.. ఈ పేరు చెబితేనే గంధపు చెక్కల స్మగ్లర్, అడవిని, ఏనుగు దంతాలను కొల్లగొట్టిన దొంగ అని ఠక్కున గుర్తు కొస్తుంది. మెట్ట ప్రాంతమైన ఉదయగిరిలోనూ కొందరు వీరప్పన్ అవతారమెత్తి అగ్రిగోల్డ్, ప్రభుత్వ రైతుల భూముల్లోని జామాయిల్ చెట్లను తెగనరికి దొంగచాటుగా రవాణా చేస్తూ రూ.లక్షలు గడిస్తున్నారు. దుత్తలూరు, ఉదయగిరి, కొండాపురం, వరికుంటపాడు, కలిగిరి, వింజమూరు తదితర మండలాల్లో అగ్రిగోల్డ్ సంస్థకు వందల ఎకరాల భూములు ఉన్నాయి. అప్పట్లో ఆ భూముల్లో సంస్థ జామాయిల్ మొక్కలు నాటింది. అవి ప్రస్తుతం కటింగ్‌కు రావడంతో అక్రమార్కులు నరికి రవాణా చేస్తున్నారు.ప్రస్తుతం టన్ను జామాయిల్ కర్ర ధర రూ.5,500 నుంచి రూ.6వేల వరకు ఉంది. దీంతో అక్రమార్కులు రైతులు, ప్రభుత్వ భూముల్లో కూడా సాగు చేసిన జామాయిల్ కర్రను నరికి అక్రమంగా రవాణా చేసి రూ.లక్షలు గడిస్తున్నారు. వీరికి కొంత మంది గ్రామ స్థాయి నేతలు, అధికారుల అండదండలు ఉండడంతో వారు తమ పనిని యథాలాపంగా కొనసాగిస్తున్నారు

● దాడులు చేస్తున్నా...

ఉదయగిరి మండలంలోని కొండాయపాళెం, తిరుమలాపురం రెవెన్యూ పరిధిలో జామాయిల్ కర్రను అక్రమార్కులు నరికి రవాణా చేస్తూ రూ.లక్షలు స్వాహా చేస్తున్నారు. ఇటీవల రెవెన్యూ, పోలీసు, అటవీ శాఖాధికారులు పలుచోట్ల దాడులు చేసి లారీలు, జామాయిల్ కర్రను స్వాధీనం చేసుకున్నారు. అయినా అక్రమార్కులు యథేచ్ఛగా అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. తమ పొలంలో జామాయిల్ కర్రను అక్రమంగా నరికివేశారని కొందరు రైతులు పోలీసులకు సైతం ఫిర్యాదు చేశారు. అయితే రెవెన్యూ అధికారులు పోలీసులకు సరైన సమాచారం ఇవ్వకపోతుండడంతో కేసుల నమోదులో జాప్యం జరుగుతోంది. దుత్తలూరు మండలంలోని తురకపల్లి, రాచవారిపల్లి గ్రామాల్లో సుమారు 400 ఎకరాల్లో అగ్రిగోల్డ్ సంస్థ జామాయిల్ సాగు చేపట్టింది. అలాగే వరికుంటపాడు, ఉదయగిరి, కొండాపురం తదితర మండలాల్లో సైతం వందల ఎకరాల్లో జామాయిల్ సాగు చేసింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొంతమంది నాయకులు యథేచ్ఛగా జామాయిల్ అక్రమ రవాణాకు పాల్పడి రూ.లక్షలు స్వాహా చేశారు. ఇంతజరుగుతున్నా రెవెన్యూ, పోలీసు అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు జామాయిల్ కర్ర అక్రమ తరలింపుపై విచారణ చేపట్టి సహకరిస్తున్న అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ఇటీవల అధికారులు స్వాధీనం చేసుకున్న జామాయిల్ కర్ర లారీ

తీవ్రంగా నష్టపోయా..



తమ గ్రామసమీపంలోని 155 సర్వే నెంబరులో తనకు ఆరెకరాల భూమి ఉంది. ఆ భూమిలో మూడేళ్ల క్రితం జామాయిల్ సాగు చేపట్టా. ఇటీవల గుర్తుతెలియని వ్యక్తులు జామాయిల్ కర్రను నరికి గుట్టుచప్పుడు కాకుండా అక్రమ రవాణాకు పాల్పడడంతో తీవ్రంగా నష్టపోయా. ఈ విషయంపై పోలీసులకు సైతం ఫిర్యాదు చేశా.

- శనివారపు వెంగళరెడ్డి, రైతు, తిరుమలాపురం

ఉదయగిరిలో విద్యార్థుల ఘర్షణ

ఉదయగిరి రూరల్, ఆగస్టు 14: పట్టణంలోని ఆనకట్టపై బుధవారం విద్యార్థులు రెండు గ్రూపులుగా ఏర్పడి ఘర్షణకు దిగారు. సాయంత్రం ఆనకట్టపై పట్టణంలోని పలు కళాశాలల్లో చదివే విద్యార్థులు కూర్చొని ఉన్నారు. ఆ సమయంలో ఓ గ్రూపులోని యువకుడిని ఉద్దేశించి మరో గ్రూపు విద్యార్థులు కామెంట్ చేశారు. ఈ విషయంపై రెండు గ్రూపుల మధ్య వివాదం చెలరేగి ఘర్షణకు దారితీసింది. వాకింగ్ చేస్తున్న స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల రాకను గమనించి విద్యార్థులకు అక్కడి నుంచి పారిపోయారు.



ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటున్న విద్యార్థులు

పేదల, ప్రభుత్వ భూములు దోచిన

కాకాణి అండ్ బ్యాచ్

- వైసీపీ నేతలు దోచిన ప్రతి రూపాయినీ కక్కిస్తాం
- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి
- బాధితులతో కలిసి కలెక్టర్‌కు ఫిర్యాదు

నెల్లూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : 'ఐదేళ్ల వైసీపీ పాలనలో సర్వేపల్లిని కాకాణి గోవర్ధన్‌రెడ్డి అండ్ బ్యాచ్ భూ కుంభకోణాలకు అడ్డాగా మార్చింది. అక్రమాలు వెలుగులోకి వస్తాయని మొన్న సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని తగలబెట్టిన ఘటన మదనపల్లి ఫైల్స్ పేరుతో పాపులర్ అయ్యింది. అంతకుమించి సర్వేపల్లి ఫైల్స్ కథ ఉంది. వైసీపీ నేతలు దోచిన ప్రతి రూపాయినీ కక్కిస్తాం. అక్రమార్కులందరినీ బోనెక్కిస్తాం' అంటూ టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని భూ సమస్యల బాధితులతో కలిసి సోమిరెడ్డి బుధవారం కలెక్టరేట్‌కు వచ్చారు. వీరందరినీ కలెక్టర్ ఆనంద్ వద్దకు తీసుకెళ్లి సమస్యలు వివరించారు. అనంతరం అక్కడికక్కడే రెవెన్యూ అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. ఫిర్యాదులపై విచారణ జరిపిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం సోమిరెడ్డి విలేకరులతో మాట్లాడారు. రామదాసుకండ్రిగ రెవెన్యూ పరిధిలో పోర్టు రోడ్డుకు ఆనుకొని ఉన్న 57 ఎకరాల పేదల భూములను ఎకరం రూ.15 లక్షల చొప్పున కాకాణి బినామీల ద్వారా హస్తగతం చేసుకున్నారని ఆరోపించారు. ఎకరం రూ.80 లక్షలకుపైగా విలువ పలుకుతున్న భూమిని జీకేఎస్ ఇండస్ట్రియల్ అండ్ సప్లై చైన్ మేనేజ్‌మెంట్ ప్రైవేటు లిమిటెడ్ అనే బినామీ కంపెనీ ద్వారా కాకాణి అల్లుడికి ధారాదత్తం చేశారని ఆరోపించారు. సర్వేపల్లి పంచాయతీ లింగంగుటలో గిరిజనులకు ఇచ్చిన 6.27 ఎకరాలను కాకాణి సన్నిహితులు లాగేసుకున్నారని చెప్పారు. ఈ భూమిని తిరిగి పేదలకైనా ఇవ్వాలి లేకుండా ఎకరాకు రూ.35 లక్షలు పరిహారమైనా గిరిజనులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. మనుబోలు మండలం కొమ్మలపూడిలో జాతీయ రహదారికి ఆనుకొని కాకాణి బినామీ అయిన మరో వ్యక్తి 20.68 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని ఆరోపించారు. పొదలకూరు మండలం సూరాయపాలెంలో 36 ఎకరాల మేత పోరంబోకు భూములను నలుగురు రెడ్ల పేరుతో రికార్డుల్లోకి ఎక్కించారని చెప్పారు. ఇలా అనేక అక్రమాలు జరిగాయని, వీటన్నింటినీ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. భూ అక్రమాలపై ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఫిర్యాదు చేశామని చెప్పారు.



భూకుంభకోణాలపై ఆధారాలతో సహా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

ఫోర్జరీ సంతకాల కేసులో మేయర్ దంపతులకు చుక్కెదురు!?

● ముందస్తు బెయిల్ నిరాకరించిన హైకోర్టు

నెల్లూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ సంతకాలను ఫోర్జరీ చేసిన కేసులో మేయర్ దంపతులకు హైకోర్టులో చుక్కెదురయ్యింది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన మేయర్ పొట్లూరి స్రవంతి భర్త జయవర్ధన్ ముందస్తు బెయిల్ దరఖాస్తును హై కోర్టు తోసిపుచ్చినట్లు సమాచారం. నూతన భవనాల మార్టిగేజ్ రిలీజ్‌కు సంబంధించి కమిషనర్ సంతకాలు ఫోర్జరీ చేశారనే అభియోగాలపై జయవర్ధన్ సహా 12 మందిపై పోలీసు కేసు నమోదైన విషయం తెలిసిందే. జయవర్ధన్‌తోపాటు మిగిలిన వారు ముందస్తు బెయిల్ కోసం హైకోర్టులో దరఖాస్తు చేసుకున్నారు. బుధవారం ఈ దరఖాస్తును పరిశీలించిన న్యాయమూర్తి ముందస్తు బెయిల్ నిరాకరించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. దీంతో జయవర్ధన్‌తోపాటు మిగిలినవారిని పోలీసులు అరెస్టు చేయడం ఖాయమనే ప్రచారం ఊపందుకుంది.

ఆర్టీసీ కార్గో ఆదాయం పెంచండి : ఈడీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 14: ఆర్టీసీకి ఆదాయ వనరుగా మారిన కార్గో సేవలను విస్తృతంగా సద్వినియోగం చేసుకుంటూ ఆదాయాన్ని పెంచాలని ఆర్టీసీ జోనల్ ఈడీ కే ఆదాం సాహెబ్ అధికారులకి పిలుపునిచ్చారు. బుధవారం నెల్లూరులోని ఆర్టీసీ ప్రధాన బస్టాండ్ ప్రాంగణంలోని కార్గో కార్యాలయ విస్తరణ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం కార్గో ద్వారా రూ.కోటిన్నరకిపైగా ఆదాయం వస్తుందని, ఈ రాబడిని మరింత పెంచాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. జిల్లా ప్రజా రవాణా అధికారి జీ విజయరత్నం మాట్లాడుతూ కార్గో భవనాన్ని విస్తరించడం ప్రజలకు మరింత సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్గో ఏటీఎం దివ్యకామాక్షి, డిప్యూటీ సీటీఎం ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

మత్తుతో చిత్తవుతున్న యువత!

● పోలీసుల అదుపులో విద్యార్థులు

కావలి రూరల్, ఆగస్టు 14: కావలి పట్టణంలోని వివిధ కళాశాలల విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని మత్తుపదార్థాల విక్రయాలు జోరుగా సాగుతోన్నాయి. దీంతో యువత జీవితాలు మత్తులో చిత్తవుతోన్నాయి. ఈ క్రమంలో మంగళవారం రాత్రి రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో మత్తు పదార్థాలు విక్రయిస్తున్న యువకుడితోపాటు మత్తులో ఉన్న మరో నలుగురు విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టణంలోని వివిధ కళాశాలల్లో ఇంటర్, డిగ్రీ చదివే విద్యార్థులు నిషేధ పెయిన్ కిల్లర్ టాబ్లెట్లను లిక్విడ్‌గా మార్చుకుని ఇంజక్షన్ల ద్వారా నరాలకు వేసుకుంటూ మత్తుకు బానిసలైనట్లు పోలీసులు గుర్తించి వివిధ కోణాల్లో విచారిస్తున్నారు. ముఖ్యంగా ఇందిరానగర్, వెంగళరావునగర్, వైకుంఠపురం రైల్వే ట్రాక్, పీజీ సెంటర్ ఎదురుగా ఉన్న అటవీ ప్రాంతం, రైల్వే స్టేషన్ పరిసరాలతో పాటు కొత్త శివాలయం వెనుక జామాయిల్ తోటను అడ్డాగా చేసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పోలీస్ స్టేషన్ల పరిసరాలల్లోనే మత్తుపదార్థాల విక్రయాలు సాగిస్తూ విద్యార్థులను మత్తుకు బానిసలను చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	107
లేయర్ లైవ్	95
స్కిన్ చికెన్	204
స్కిన్‌లెస్	224
లేయర్	161

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6788
వెండి కిలో ధర	రూ. 83,400
వెండి ఒక గ్రాము	రూ. 86.40

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

కావలి రూరల్, ఆగస్టు 14: కుటుంబ కలహాలతో రైలు కింద పడి మన్నెం వెంకటేశ్వర్లు(36) ఆత్మహత్య చేసుకున్న సంఘటన కావలి రైల్వే స్టేషన్ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. జీఆర్పీ పోలీసుల వివరాల మేరకు... కొండాపురం మండలం సాయిపేట పంచాయతీ వెల్లటూరి వారిపాలెంకు చెందిన వెంకటేశ్వర్లు కుటుంబ కలహాలతో ఇంటి నుంచి కావలి వచ్చి ఎగువమార్గంలో గుర్తు తెలియని రైలు కింద పడి మృతి చెందాడు. మృతుడి వద్ద లభించిన ఆధారాల మేరకు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా కుటుంబ కలహాలతో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య స్వాతి, ముగ్గురు పిల్లలున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి హెడ్ కానిస్టేబుల్ శ్యామ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వెంకయ్య నాయుడుకి బీజేపీ నేతల స్వాగతం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 14: నెల్లూరు నగరానికి రైలు మార్గంలో విచ్చేసిన మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడుకి ప్రధాన రైల్వే స్టేషన్‌లో బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు పీ సురేంద్ర రెడ్డి, మండ్ల ఈశ్వరయ్య, గడ్డం విజయ్ కుమార్, ఎర్రబోలు రాజేష్, కేవీ సుబ్రహ్మణ్యం, జనార్దన్‌రాజు పాల్గొన్నారు.



వెంకయ్యకు స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

● స్వర్ణభారత్ ట్రస్ట్‌లో..

వెంకటాచలం : స్వర్ణభారత్ ట్రస్ట్‌కు చేరుకున్న వెంకయ్యనాయుడుకు పలువురు అధికారులు, ఎన్డీఏ కూటమి నేతలు ఘనస్వాగతం పలికారు. గురువారం ఉదయం అక్షర విద్యాలయంలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ సంబరాల్లో ఆయన పాల్గొంటారు. 16న స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఏర్పాటు చేసిన జైపూర్ ఫుట్ క్యాంప్‌లోనూ, 17వ తేదీన ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్‌తో కలిసి వెంకయ్యనాయుడు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఏర్పాటు చేసిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

పొగాకు ఉత్పత్తులతో అనారోగ్యం : డీఎంహెచ్‌వో



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 14 : పొగాకు ఉత్పత్తుల వాడకంతో ఎన్నో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య అన్నారు. పొగాకు ఉత్పత్తుల నియంత్రణలో భాగంగా బుధవారం ఆయన చాంబర్‌లో ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుధీర్‌కుమార్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. పెంచలయ్య మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులైన సిగరెట్, ఇతర మత్తు పదార్థాల వినియోగంతో శరీరంలో అనేక మార్పులు చోటు చేసుకుంటాయని, పలు రకాల వ్యాధులు సంక్రమిస్తాయని తెలియచేశారు. అలాంటి వాటికి దూరంగా ఉండాలని హెచ్చరించారు. రాష్ట్ర లీగల్ సెల్ కన్సల్టెంట్ శివకుమార్ మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల నియంత్రణకు ఉన్న చట్టాలను పక్కాగా అమలు చేయాలని కోరారు. పొగాకు ఉత్పత్తుల వల్ల వచ్చే వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ సుధీర్‌కుమార్ తెలియచేశారు. పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే అనర్థాలపై రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది ప్రదీప్, పోలీసుశాఖ, విద్యాశాఖ, పంచాయతీ, మున్సిపల్, రవాణా తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పార్టీ పేరుచెప్పి అరాచకాలు సృష్టిస్తే చర్యలు

- వాటంబేటి నాగేంద్రను బహిష్కరించాం
- సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య

నెల్లూరు(వైద్యం): పార్టీ పేరు చెప్పి అరాచకాలు సృష్టించే వారిపై చర్యలు తప్పవని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య స్పష్టం చేశారు. బుధవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడిగా ఉన్న వాటంబేటి నాగేంద్రను పార్టీ నుంచి తొలగిస్తున్నామని ప్రకటించారు. డిగ్రీ సర్టిఫికెట్లు ఇప్పిస్తామని డబ్బు వసూలు చేయటం, ఎవరైనా సమస్యల మీద వస్తే డబ్బులు డిమాండ్ చేయటం వంటివి చేశారని ఆరోపించారు. ఎవరైనా ఇళ్లు నిర్మించుకుంటుంటే వారి వద్దకు వెళ్లి పర్మిషన్ ఉందా అంటూ పార్టీ పేరు చెప్పి డబ్బు వసూలు చేయటం వంటి ఎన్నో అరాచకాలకు పాల్పడ్డారన్నారు. ఈ నేపథ్యంలో నాగేంద్రను పార్టీ నుంచి బహిష్కరించామని తెలిపారు. అలాగే లీలామోహన్, నరసింహులు అనే వ్యక్తులు తమ పార్టీ వారు కాదని, వారికి పార్టీతో ఎలాంటి సంబంధం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నందిపోగు రమణయ్య, సురేష్, నందయ్య, మధు, సీపీఐ నగర సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్, షాన్‌వాజ్, మున్వర్, ఆనంద్ పాల్గొన్నారు.

సర్వీస్ వైర్ కట్ చేసిన లైన్‌మన్‌పై దాడి

నెల్లూరు(క్రైం), ఆగస్టు 14: కరెంటు బిల్లు కట్టకపోవడంతో సర్వీసు వైర్ కట్ చేసిన అసిస్టెంట్ లైన్‌మన్‌పై దాడి చేసిన ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు కే రాజేష్ అనే వ్యక్తి పడారుపల్లిలో అసిస్టెంట్ లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన రామచంద్రయ్య కరెంటు బిల్లు కట్టకపోవడంతో ఆయన ఇంటి విద్యుత్ సర్వీస్ వైర్‌ను రాజేష్ మంగళవారం కట్ చేశాడు. దీంతో ఆవేశానికి లోనైన రామచంద్రయ్య, అతని కుమారుడు మనోహర్ కలిసి రాజేష్‌పై దాడి చేశారు. బాధితుడు బుధవారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయగా ఇన్‌స్పెక్టర్ టీవీ సుబ్బారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాల పటిష్టతపై పవన్ దృష్టి

● జనసేన జిల్లా పరిశీలకుడు అజయ్‌కుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

నెల్లూరు (వెంకటేశ్వరపురం), ఆగస్టు 14 : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గ్రామాల పటిష్టతపై జనసేన పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రత్యేక దృష్టి పెట్టారని జనసేన జాతీయ మీడియా అధికార ప్రతినిధి, జిల్లా పరిశీలకుడు వేములపాటి అజయ్‌కుమార్ తెలిపారు. నెల్లూరులోని గోమతినగర్‌లో గల పార్టీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ చెప్పిన విధంగా గ్రామాలు ఎప్పుడు పటిష్టపడి స్వరాజ్యం దిశగా అడుగులు వేస్తాయో అప్పుడు భారతదేశం పటిష్టమవుతుందన్నారని తెలిపారు. ఈ క్రమంలోనే ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గ్రామ స్వరాజ్యానికి కృషి చేస్తున్నారని చెప్పారు. ఇందులో భాగంగానే స్వాతంత్ర్య దినోత్సవం కోసం పంచాయతీలకు నిధులు విడుదల చేశారన్నారు. ఒకే రోజు రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 13,452 గ్రామాల్లో సభలు నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చారన్నారు. పార్టీ పటిష్టతకు అందరం కలిసి పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నునె మల్లికార్జున యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, కృష్ణారెడ్డి, రవి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వాసికి అరుదైన గౌరవం

కర్ణాటక అదనపు డీజీపీకి రాష్ట్రపతి అవార్డు

నెల్లూరు (ఆంధ్రజ్యోతి) : నెల్లూరుకు చెందిన ముప్పా చంద్రశేఖర్‌కి అరుదైన గౌరవం లభించింది. కర్ణాటక అదనపు డీజీపీగా పనిచేస్తున్న ఆయన్ను ప్రతిష్టాత్మక రాష్ట్రపతి అవార్డు వరించింది. పోలీసు శాఖలో చంద్రశేఖర్ చేసిన సేవలకు, భారత ప్రభుత్వం రాష్ట్రపతి అవార్డుకు ఎంపిక చేసింది. సంగం మండలం కొండూరుకి చెందిన చంద్రశేఖర్ ఖరగ్‌పూర్ ఐఐటీ బీటెక్ పూర్తి చేశారు. ఇన్ఫోసిస్‌లో ఇంజనీరుగా ప్రస్థానం మొదలు పెట్టారు. ప్రజలకి తన వంతు సేవ చేయాలనే తపనతో సివిల్స్ వైపు అడుగులు వేశారు. మొదటి ప్రయత్నంలోనే ఐపీఎస్‌కి ఎంపికయ్యారు. కర్ణాటక రాష్ట్ర పోలీసు శాఖలో పలు హోదాల్లో విధులు నిర్వర్తించి ప్రజల మన్ననలు పొందారు. ముప్పా చంద్రశేఖర్‌కి రాష్ట్రపతి అవార్డు రావడంపై జిల్లావాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



చంద్రశేఖర్

కోల్‌కతా దుర్ఘటన పునరావృతం కారాదు

● వైద్యులకు రక్షణ కల్పించాలి ● నగరంలో సైలెంట్ మార్చ్



సైలెంట్ మార్చ్ నిర్వహిస్తున్న వైద్యులు

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 14 : కోల్‌కతా దుర్ఘటన పునరావృతం కారాదంటూ వైద్యులు నెల్లూరు నగరంలో సైలెంట్ మార్చ్ నిర్వహించారు. బుధవారం సాయంత్రం గాంధీబొమ్మ నుంచి వీఆర్‌సీ వరకు ఈ నిరసన కార్యక్రమం చేపట్టారు. గైనకాలజీ సొసైటీ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ పల్లంరెడ్డి యశోధర మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీన కోల్‌కతాలోని ఆర్‌జీ వైద్య కళాశాల ఆసుపత్రిలో పీజీ చేస్తున్న మహిళా డాక్టర్‌పై సంజయ్ అనే వ్యక్తి హత్యాచారానికి పాల్పడటం దారుణమన్నారు. ఆ వ్యక్తిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వైద్యులకు తగిన రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నాయకులు డాక్టర్ అశోక్, డాక్టర్ శ్రీనివాసతేజ, డాక్టర్ లక్ష్మి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆత్మకూరు అభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయండి : మంత్రి ఆనం

ఆత్మకూరు, ఆగస్టు 14 : ఆత్మకూరు అభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. మంత్రి ఆనం ముఖ్యఅతిథిగా హాజరై వివిధ శాఖల అభివృద్ధి పనులపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారులంతా క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడే సమస్యలు పరిష్కారమవుతాన్నారు. ఆత్మకూరు మండలానికి రూ. 117 కోట్లతో జలజీవన్ మిషన్ పనులు మంజూరు కాగా, కేవలం రూ. ఏడు కోట్ల మేరకే పనులు చేపట్టడం ఏమిటని ప్రశ్నించారు. మిగిలిన నిధులను కూడా ఆరునెలల్లోగా ఖర్చుచేసి ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ఆత్మకూరు మండలానికి మూడు లక్షల ఉపాధిహామీ పని దినాలు మంజూరయ్యాయని, గ్రామాల్లో ఉపాధి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలో రెండు ప్రధాన రహదారులు అభివృద్ధికి రూ. 5.60 కోట్లు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానన్నారు.

● **31న మంత్రి సత్యకుమార్ రాక**

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఈనెల 31న ఆత్మకూరులోని ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు రానున్నారని మంత్రి ఆనం తెలిపారు. ఆయనతో చర్చించి ఆసుపత్రి అభివృద్ధికి చర్యలు చేపడతామన్నారు. ఈనెలాఖరులోగా అధికారుల బదిలీలు పూర్తి చేసి సెప్టెంబరు 1 నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. మంత్రి హోదాలో తొలిసారిగా సమావేశానికి విచ్చేసిన ఆనంకు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ నేతలు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు మేళతాళాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కే మధులత, జడ్పీ సీఈవో కన్నమనాయుడు, డ్వామా పీడీ బీ శ్రీనివాసులు, హౌసింగ్ పీడీ దయాకర్, ఎంపీడీవో పీ ఐజాక్‌ప్రవీణ్, మండల అధికారులు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి ఆనం

వాటర్ ప్లాంట్‌కు భూమి పూజ

సీతారామపురం, ఆగస్టు 14: మండలంలోని సీతారామపురం దళితవాడలో వాటర్ ప్లాంటు ఏర్పాటుకు బుధవారం ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచి కే భాగ్యకుమారి, వైసీపీ మండల కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి,కోఆప్షన్ మెంబర్ హైదర్‌వలి,కార్యదర్శి జీవన్,పిడతల ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధం

సంగం, ఆగస్టు 14: మండలంలోని అన్నీ ప్రభుత్వ కార్యాలయాల్లోనూ, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, పంచాయతీల్లోనూ గురువారం జరిగే స్వాతంత్ర్య వేడుకలకు ఏర్పాట్లు చేశారు.

● **ప్రత్యేక గ్రామసభలు నిర్వహించాలి**

ఉదయగిరి రూరల్ : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మండలంలోని 17 పంచాయతీల్లో వేడుకలు నిర్వహించడంతోపాటు ప్రత్యేక గ్రామసభలు నిర్వహించాలని ఎంపీడీవో డీ ఈశ్వరమ్మ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

చేజర్ల : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాలను కూడా అందంగా అలంకరించారు.

దుత్తలూరులో విద్యార్థుల మానవహారం



కలువాయి : కుల్లూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

దుత్తలూరు(ఉ దయగిరి రూరల్) : హర్ ఘర్ తిరంగా వేడుకల్లో భాగంగా బుధవారం స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థులు దుత్తలూరు సెంటర్‌లోని 565 జాతీయ రహదారిపై మానవహారం ఏర్పాటు చేశారు. తొలుత పాఠశాల నుంచి సెంటర్ వరకు జాతీయ జెండాలు చేతపట్టి నినాదాలతో ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేకపాటి మాల్యాద్రినాయుడు, చుండి హరిగోపాల్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ సైమన్‌రావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం : హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీగా నిర్వహించారు. ప్రతీ ఇంట్లో జాతీయ జెండా రెపరెపలాడాలని, ప్రతి ఒక్కరూ దేశ భక్తితో మెలగాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు, మండల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

కలువాయి : మండలంలోని కుల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మహబూబ్‌వాషా ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా బుధవారం విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ఏజీఎంసీ వెంకటకృష్ణ, ఎన్ఎస్ఎస్ పీవో జయకిషోర్, అధ్యాపకులు సురేష్, రామాంజనేయులు, శ్రీనివాసులు కల్పన, సుప్రజ పాల్గొన్నారు.

ఉదయగిరిని జిల్లా చేయాలని వినతి

ఉదయగిరి రూరల్ : ఉదయగిరిని జిల్లా చేయాలని కోరుతూ బుధవారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని ఉదయగిరి జిల్లా సాధన సమితి నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. నెల్లూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో వారు కలిశారు. అనంతరం మాట్లాడుతూ నెల్లూరు, ప్రకాశం, కడప జిల్లాల్లోని వెనుకబడిన 21 మండలాలను కలిపి ఉదయగిరిని కేంద్రంగా జిల్లా చేయాలన్నారు. జిల్లా అవశ్యకతపై సోమిరెడ్డి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి నాయకులు డాక్టర్ వేణుగోపాల్, షేక్ ఎండీ ఖాజా, ఓంకారం శ్రీనివాసరాజు, దశరథరామ్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు వెంటనే కార్డులు అందించాలి

కలువాయి : కౌలు రైతులకు కార్డులను త్వరితగతిన అందజేయాలని పొదలకూరు వ్యవసాయశాఖ ఏడీఏ కె.శివనాయక్ సిబ్బందికి సూచించారు. మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో బుధవారం వీఆర్వోలు, వీఏఏలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కౌలు రైతుల కార్డులపై సిబ్బంది తమకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త కిరణ్, గ్రోమోర్ శాస్త్రవేత్త నర్సిరెడ్డి, ఎస్‌వో శశికాంత్, ఏవో ప్రతాప్, డీటీ.వెంకటేశ్వర్లు సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన

సీతారామపురం : మండల పరిధిలోని అయ్యవారిపల్లిలో సాగులో ఉన్న మొక్కజొన్న పంటను పొదలకూరు ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ సురేఖాదేవి బుధవారం సందర్శించారు. మొక్కజొన్న పైరులో పొగాకు లద్దెపురుగు, కత్తెర పురుగు ఉన్నట్లు గుర్తించామన్నారు. నివారణకు లీటరు నీటికి 5ఎంఎల్ వేప నూనె లేదా లీటర్ నీటికి 0.5 గ్రాముల ఇమామెక్టిన్ బెంజోయేట్ పిచికారీ చేయాలని సూచించారు. ఆమె వెంట మండల వ్యవసాయాధికారి పీ చెన్నారెడ్డి,వీఏఏ నరేంద్ర తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

సీతారామపురం : ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా వ్యవసాయ, ఆర్‌డబ్ల్యూఎస్, ఉపాధిహామీ, విద్యాశాఖ, వైద్యఆరోగ్య శాఖ, అధికారులు తమతమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామం అభివృద్ధి పథంలో నడవాలని, అందుకు ప్రజాప్రతినిధులు, అధికారుల మధ్య సమన్వయం ఉండాలన్నారు. మండలాభివృద్ధికి అధికారులు చిత్త శుద్ధితో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు భాగ్యకుమారి, వెంకట సుబ్బయ్య, పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులు పాల్గొన్నారు.

డీఎస్పీ వేణుగోపాల్ బాధ్యతల స్వీకరణ

ఆత్మకూరు : డీఎస్పీగా కే వేణుగోపాల్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఐ గంగాధర్‌రావు, పలువురు ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది ఆయన్ను సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు.

తహసీల్దారుకి సన్మానం

సంగం : తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన సోమ్లానాయక్‌ను బుధవారం టీడీపీ నాయకులు శాలువాతో సత్కరించారు. టీడీపీ జిల్లా కార్యదర్శి బాణా శ్రీనివాసులురెడ్డి, తలుపూరుపాడు టీడీపీ నాయకులు షేక్ ఖాదర్ బాషా తదితరులు సన్మానించిన వారిలో ఉన్నారు.

ఎంపీడీవోకి...

వరికుంటపాడు : ఎంపీడీవో తోట వెంకటకృష్ణకుమారి బదిలీపై ప్రకాశం జిల్లాకు వెళుతుండడంతో ఆమెను బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, కార్యాలయ సిబ్బంది శాలువాలు, పూలమాలలతో సన్మానించి, వీడ్కోలు పలికారు.

ముగిసిన సర్పంచుల శిక్షణ

ఉదయగిరి రూరల్ : స్థానిక స్త్రీశక్తి భవనంలో మూడు రోజులుగా జరుగుతున్న సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణ బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ మల్లికార్జున పంచాయతీల అభివృద్ధికి, పారిశుధ్యం మెరుగుకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. అనంతరం పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక పత్రాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు సయ్యద్ గౌస్‌మొహిద్దీన్, నెల్లూరు వెంకటస్వామి, వరలక్ష్మి, సామ్రాజ్యం, తిరుపతయ్య, కార్యదర్శులు అమర్‌నాథ్‌రెడ్డి, కరీముల్లా పాల్గొన్నారు.

ఇన్‌చార్జిలే దిక్కు!

● అస్తవ్యస్తంగా పాలన ● కుంటుపడుతున్న అభివృద్ధి
● ప్రధాన శాఖల అధికారుల కుర్చీలు ఖాళీ
● ప్రభుత్వం మారినా కానరాని మార్పు



కావలి, ఆగస్టు 14 : కావలి డివిజన్‌లో ప్రధాన శాఖల అధికారుల కుర్చీలన్నీ ఖాళీగా ఉండడంతో ఇన్‌చార్జి అధికారుల పాలన అస్తవ్యస్తంగా మారి అభివృద్ధి కుంటుపడుతోంది. ముఖ్యంగా హౌసింగ్, విద్యుత్, ఆర్‌అండ్‌బీ, నీటి పారుదల శాఖలలో ఇన్‌చార్జి అధికారులే దిక్కయ్యారు. ఇక్కడి ప్రధాన శాఖలకు అధికారులు లేకపోగా కొన్ని శాఖలకు ఉన్న అధికారులు ఇతర ప్రాంతాలకు ఇన్‌చార్జిలుగా కొనసాగుతున్నారు. దీంతో ఇన్‌చార్జి అధికారులు ఎక్కడా న్యాయం చేయలేక కాలం వెళ్లబుచ్చుతున్నారని, ఫలితంగా అభివృద్ధి వైపు అడుగులు పడడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వం మారినా పాలనలో మాత్రం మార్పు కనిపించటంలేదన్న గుసగుసలూ వినిపిస్తోన్నాయి.

● **గృహ నిర్మాణ శాఖ నిర్వీర్యం**

పేదలకు శాశ్వత గూడు కలిపంచేందుకు కోట్లాది రూపాయలతో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్న నేపథ్యంలో గృహ నిర్మాణ శాఖలో ఈఈ, డీఈలు ఇద్దరు ఇన్‌చార్జులు కావడంతో ఆశాఖ పూర్తిగా నిర్వీర్యమైపోయింది. ఒక్క కావలిలోనే సుమారు 6 వేల ఇళ్ల నిర్మాణాలు జరుగుతుండగా వాటిలో అనేక అవినీతి అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ ఇళ్ల నిర్మాణ సమయంలో ఉన్న డీఈ ఖాజామొహిద్దీన్ ఈ ఏడాది మే నెలలో పదవీ విరమణ చెందగా ఆయన స్థానంలో కందుకూరు డీఈ శ్రీనివాసరావుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అలాగే ఈఈ వరప్రసాద్ జూన్ 30న పదవీ విరమణ చెందగా ఆయన స్థానంలో నెల్లూరు డీఈ మాధవరావుకు కావలి ఇన్‌చార్జి ఈఈ బాధ్యతలు అప్పగించారు. పదవీ విరమణ చెందిన వారి స్థానంలో కొత్తవారిని నియమించకుండా ఇన్‌చార్జీలకు బాధ్యతలు అప్పగించటంతో వారు అక్రమాలకు నిలయమైన కావలిలో చేయి పెడితే కాలిపోతామన్న భయంతో చుట్టపు చూపుగా వచ్చిపోతూ కాలం వెళ్లబుచ్చుతున్నారు.

● **కావలి అంటే విద్యుత్ అధికారులకే షాక్**

కావలి పేరు వింటే విద్యుత్ శాఖ అధికారులే షాక్ తగులుతోంది. ఇక్కడి ఏడీఈ శంకరయ్య ఏడాది క్రితం బదిలీ చేయించుకుని వెళ్లా రు. అప్పటి నుంచి అల్లూరు, కలిగిరి ఏడీఈలు కొంత కాలం ఇన్‌చార్జిలుగా పని చేసి వారు కూడా మావల్ల కాదంటూ చేతులెత్తేశారు. దీంతో కావలి రూరల్ ఏఈ శ్రీనివాసులురెడ్డికి ఏడీ ఈ బాధ్యతలు అప్పగించారు. అలాగే కావలి వన్‌టౌన్ ఏఈ కుమార్ ఒకటిన్నర సంవత్సరం కిందట బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి ఆ పోస్టులో ఎవరినీ నియమించకపోవడంతో కావలి టూటౌన్ ఏఈ వసంతరావు ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. ఇన్‌చార్జి అధికారుల పర్యవేక్షణ కొరవడి విద్యుత్ సరఫరా సక్రమంగా జరగడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

● **ఆర్‌అండ్‌బీలో నూ అంతే...**

కావలి ఆర్‌అండ్‌బీ డీఈ మస్తాన్‌రావు ఏడాది క్రితం బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి ఆ పోస్టుకు ఎవరినీ నియమించక పోవడంతో దుత్తలూరు ఏఈ ఇన్‌చార్జి డీఈగా కొనసాగుతున్నారు. దీంతో ఆర్‌అండ్‌బీ రోడ్లపై గుంతలకు తట్టెడు మట్టి వేసే పరిస్థితి కూడా కనిపించడం లేదన్న విమర్శలున్నాయి.

● **ఇరిగేషన్‌లో రివర్స్ పాలన**

కావలి ఇరిగేషన్‌లో రివర్స్ పాలన కొనసాగుతోంది. కావలి ఈఈ కృష్ణమోహన్ నెల్లూరు ఇన్‌చార్జి ఎస్ఈగా, కావలి డీఈ పీఎం ఖాన్ నెల్లూరు ఇన్‌చార్జి ఈఈగా కొనసాగుతోన్నారు. వీరిద్దరికి కావలి కన్నా నెల్లూరు ఇన్‌చార్జి పదవులు పెద్దవి కావడంతో వారు ఎక్కువ సమయం అక్కడే కేటాయించాల్సి వస్తోంది. కావలి డివిజన్‌లో వర్షాధారమైన చెరువులు ఎక్కువగా ఉండటంతో వాటి పటిష్టతకు అవసరమైన చర్యలు తీసుకోవడంపై అసలు దృష్టి పెట్టలేకున్నారు.

● **కొత్త ప్రభుత్వంలోనైనా ఇన్‌చార్జి పాలన తొలగేనా?**

రాష్ట్రంలో ఏర్పడిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వంపై ప్రజలు కోటి ఆశలతో వారికి అధికారం ఇచ్చి పాలనలో కొత్త దనం ఆశిస్తున్నారు. కొత్త ప్రభుత్వంలోనైనా ఖాళీలను భర్తీ చేసి ఇన్‌చార్జిల పాలనకు చరమగీతం పాడి సక్రమమైన పాలన అందిస్తారని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

నిరాడంబరుడు మస్తాన్ : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి, ఆగస్టు 14: మాజీ కౌన్సిలర్, సామాజిక కార్యకర్త, టీడీపీ మైనార్టీసెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ మస్తాన్ నిరాడంబరుడని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి కొనియాడారు. మస్తాన్ 88వ జన్మదిన వేడుకలు బుధవారం కావలి పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో జరిగాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఆయనకు తినిపించి మస్తాన్‌ను సత్కరించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ ఎన్. ప్రభాకర్‌నాయుడు మాట్లాడుతూ మస్తాన్ తనకు మంచి మిత్రుడిని తనతో కలిసి నడిచారన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు పోతుగంటి అలేఖ్య, గుత్తికొండ క్రిషోర్, కండ్లగుంట మధుబాబు నాయుడు, బొట్లగుంట శ్రీహరినాయుడు, జ్యోతి బాబూరావు, నాయుడు రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 100 అడుగల ఎత్తు జాతీయ జెండా ఆవిష్కరణ

కావలి, ఆగస్టు 14: వైసీపీ పాలనలో అమృత్ ఫైలాన్‌ను ధ్వంసం చేసిన చోట ఏర్పాటు చేసిన 100 అడుగుల ఎత్తులో జాతీయ జెండాను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం ఆవిష్కరిస్తున్నట్లు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఎన్టీఆర్ విగ్రహం ఎదురుగా జాతీయభావం పెంపొందించే విధంగా నిర్మాణాలు చేపట్టామన్నారు. ఈ జాతీయ జెండాను విద్యార్థులతో ప్రారంభిస్తామన్నారు. కావలి పట్టణంలోని అని విద్యాసంస్థల విద్యార్థులు తమ విద్యాసంస్థలలో జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం ర్యాలీగా ఇక్కడకు చేరుకుంటారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ఈ కార్యక్రమం విజయవంతం చేసేందుకు తమవంతు కృషి చేయాలని కోరారు. మధ్యాహ్నం విద్యార్థులందరికీ భోజన ఏర్పాట్లు చేశామన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు మలిశెట్టి వెంకటేశ్వర్లు, గుత్తికొండ క్రిషోర్, పోతుగంటి అలేఖ్య, గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, జ్యోతి బాబూరావు, దావులూరి దేవకుమార్, జనిటర్ల మనోహర్, బాలగురుస్వామి, జనసేన పట్టణ అధ్యక్షుడు పొబ్బాసాయి తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



నిర్మాణ పనులకు పూజ చేస్తున్న ఎమ్మెల్యే

కందుకూరు, ఆగస్టు 14: పట్టణంలోని కోవూరు రోడ్డులో ఉన్న అగపే చర్చి నుంచి ఉప్పు చెరువు రోడ్డులోని రాజరాజేశ్వరి ఆలయం వరకు డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం శంకుస్థాపన చేశారు. రూ.26.10 లక్షలతో నిర్మించనున్న ఈ డ్రైనేజీ పనులను తక్షణం ప్రారంభించి నాణ్యతా ప్రమాణాలతో పూర్తిచేయాలని ఆయన అధికారులకు సూచించారు. అనంతరం ఏకలవ్యనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన రోడ్డు, డ్రైనేజి పూడికతీత పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేవీ కృష్ణారెడ్డి, నాయకులు దామా మల్లేశ్వరరావు, ఉన్నం వీరాస్వామి, చిలకపాటి మధు, చదలవాడ కొండయ్య, షేక్ రఫీ, బెజవాడ ప్రసాదు, కూనం నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఎండుతున్న కడనూతల చెరువు : చనిపోతున్న చేపలు

బిట్రగుంట, ఆగస్టు 14: బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ కడనూతల చెరువు దాదాపుగా ఎండిపోవడంతో బుధవారం ఎండ బెట్టతో చేపలు చనిపోయి తేలాడుతున్నాయి. వేసవి కాలాన్ని తలపిస్తు భానుడు ప్రభావంతో మూగజీవులకు తాగునీరు కరువైంది. చెరువు సొసైటీ వివాదాల కారణంగా ప్రస్తుతం చెరువులో చేపలు పట్టడం నిలిపివేశారు. అయితే అనధికారికంగా కొందరు చనిపోతున్న చేపలను పట్టుకునే పనిలో ఉన్నారు. మూడు వందల ఎకరాలకు పైగా విస్తీర్ణం ఉండే చెరువు ఎండిపోవడానికి ప్రధాన కారణం లోతులేక పోవడమేనని రైతులు అంటున్నారు. చెరువులో పూడుక తీసి ఆయకట్టు రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

గిరిజన కాలనీలో అంతర్గత రోడ్లకు మరమ్మతులు

బిట్రగుంట, ఆగస్టు 14: బోగోలు మండలం చెంచులక్ష్మీపురం గిరిజన కాలనీలోని అంతర్గత రోడ్లు గోతులమయంగా మారడంతో టీడీపీ గిరిజన నేత బోగిరి ప్రభాకర్ తన సొంత నిధులతో బుధవారం మట్టి తోలించి మరమ్మతులు చేయించారు. రానున్న వర్షాకాలనీ దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆదేశాల మేరకు ముందస్తు పనులు చేస్తున్నామని ప్రభాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు సంజయ్, సుభాని, కిరణ్, మొల్లా తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పని కల్పించండి

లింగసముద్రం, ఆగస్టు 14 : ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలోని ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని ఆ పథకం కందుకూరు ఏపీడీ జె బాబూరావు ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కె శ్రీనివాసులు అధ్యక్షతన ఉపాధి హామీ పథకంపై సమీక్ష నిర్వహించారు. బాబూరావు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో పనులు ప్రారంభించాలని, కొత్త పనులు గుర్తించాలని, కూలీల సంఖ్య పెంచాలని ఏపీవో షేక్ సమీర్‌బాషా, టీఏ ఈసీ చిన కోటయ్య, తదితరులను ఆదేశించారు.

ట్రాక్టర్ బోల్తా : యువకుడి మృతి



మృతి చెందిన ఏకుల వెంకటేశ్వర్లు

బిట్రగుంట, ఆగస్టు 14: బోగోలు మండలం సీఆర్ పాలెం పంచాయతీ పాతపాలెం శివారుల్లో బుధవారం సిమెంట్ బ్రిక్స్ లోడుతో వెళుతున్న ట్రాక్టర్ బోల్తాపడి ఏకుల వెంక టేశ్వర్లు (18) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. అల్లూరు మండలం ఆర్‌డీఆర్ కాలనీకి చెందిన వెంకటేశ్వర్లు ట్రాక్టర్ లోడింగ్ పనులకు వెళుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో జువ్వలదిన్నెలో సిమెంట్ బ్రిక్స్ లోడ్ చేసుకుని తిరిగి అల్లూరుకు వస్తున్న సమయంలో పాతపాలెం శంభునిపాలెం మధ్య ఎదురుగా వస్తున్న స్కూల్ బస్సును తప్పించ బోయి ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ట్రక్కులో ఉన్న వెంకటేశ్వర్లు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అతనితో పాటు ఉన్న చెంచయ్య, శీనయ్యలకు గాయాలయ్యాయని ఏఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియచేసి మృతదేహాన్ని కావలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించామని ఆయన తెలిపారు.

సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

కొండాపురం, ఆగస్టు 14: మండలంలోని సాయిపేట పంచాయతీ ఎర్రబాలెంలో సీతారాములతోపాటు లక్ష్మణ, ఆంజనేయ విగ్రహాల ప్రతిష్ఠ బుధవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. గ్రామంలోని ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన ఆలయంలో రెండు రోజులుగా పూజలు నిర్వహించి మూడవ రోజు విగ్రహాల ప్రతిష్ఠను వేదమంత్రోచ్ఛరణల నడుమ పండితులు ఘనంగా నిర్వహించారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థి విరాళం

లింగసముద్రం, ఆగస్టు 14 : స్థానిక కేఆర్ జడ్పీ హైస్కూల్ అభివృద్ధికి ఆ పాఠశాల పూర్వ విద్యార్థి, ఎన్ఆర్ఐ మద్దా శివన్నారాయణ రూ.50 వేల వితరణ చేశారు. ఈ మేరకు 1993-94 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన ఆయన హెచ్ఎం ఉమ్మడిశెట్టి మాధవరావుకు బుధవారం చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏ నారాయణ, కే.ప్రభాకర్, ఎం.కొండయ్య, కే.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలపై అవగాహన

కందుకూరు, ఆగస్టు 14: మండలంలోని దొండపాడులో కందుకూరు సీఐ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం శాంతిభద్రతలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అసాంఘిక కార్యక్రమాలకు అవకాశం ఇవ్వకుండా పోలీసులకు సహకరించాలన్నారు. జూదం, మద్యం, గంజాయి లాంటి కార్యకలాపాలు జరుగుతున్నట్లు మీ దృష్టికి వస్తే మాకు సమాచారం ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సూచించారు. ఆయన వెంట ఎస్ఐ రమణయ్య, తదితరులున్నారు.

యాచకులకు దుస్తుల పంపిణీ

కావలిటౌన్, ఆగస్టు 14: బ్రాహ్మణ మహాసంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని యాచకులకు బుధవారం శివాలయం వద్దనున్న శంఖరమఠంలో దుస్తులు పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షుడు పీవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ పురుషులకు రెండు పంచలు, తువ్వాలు, మహిళలకు రెండు చీరలు, అందరికీ భోజన ప్యాకెట్లు అందించామన్నారు. కార్యక్రమంలో సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, వైస్ ప్రెసిడెంట్ సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, రమేష్, రవికుమార్, శర్మ తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా ఆసుపత్రి ఏర్పాటు వరం

కావలిటౌన్, ఆగస్టు14: కావలిలో తలసేమియా ఆసుపత్రి ఏర్పాటు వ్యాధిగ్రస్తులకు ఒక వరమని చెన్నైయ్ అపోలో చిన్నపిల్లల రక్తసంబంధిత వ్యాధి నిపుణులు డాక్టర్ రమ్య ఉప్పుటూరి పేర్కొన్నారు. రెడ్‌క్రాస్ ఆహ్వానం మేరకు ఆమె కావలి రెడ్‌క్రాస్ రక్తనిధి ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన తలసేమియా కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్, డాక్టర్లు బెజవాడ రవికుమార్, శ్రీధర్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు కలికి శ్రీహరిరెడ్డి, హరినారప రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

18న ఎడ్ల బండలాగుడు పోటీలు

కందుకూరు, ఆగస్టు 14: మండలంలోని మహదేవపురంలో ఈనెల 18వ తేదీన రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ కమిటీ ప్రతినిధులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామదేవత అంకమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సీనియర్స్, జూనియర్స్ విభాగాలలో వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అల్లూరు, ఆగస్టు 14 : మండలంలోని బీరంగుంట, నార్తుఆములూరు గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అల్లూరు విద్యుత్ శాఖ ఏఈ మస్తాన్‌షరీఫ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ విద్యుత్ లైన్ల ఏర్పాటు కారణంగా సరఫరాకు అంతరాయం కలుగుతుందని ప్రజలు సహకరించాలని కోరారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టండి

లింగసముద్రం, ఆగస్టు 14 : గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు చెప్పారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రామసుబ్బారావు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

బిట్రగుంట, ఆగస్టు 14: బోగోలు మండలంలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో వెంకటసుబ్బారావు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గ్రామీణ నీటి సరఫరా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులతో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఈశ్రీనివాసులు, ఈవోపీఆర్డీ శ్రీదేవి, మాలేపాటి నాగేశ్వరావు పాల్గొన్నారు.

రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించాలి

వలేటివారిపాలెం : పంటల సాగులో రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలని కందుకూరు కేవీకే సీనియర్ శాస్త్రవేత్త జి.ప్రసాద్ బాబు, ఏడీఏ అనసూయ తెలిపారు. బుధవారం శాఖవరం రైతు సేవా కేంద్రంలో క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ నిహారిక, మాయాంక్, ఏవో హేమంత్‌భరత్‌కుమార్ పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

పీఎం చిత్రపటాల వితరణ



ఎస్ఐ రామకృష్ణకి ప్రధాని చిత్రపటాన్ని అందిస్తున్న నాయకులు

పొదలకూరు, ఆగస్టు 14: స్థానిక పోలీస్‌స్టేషన్, సామాజిక ఆరోగ్య కేంద్రం, ఎంపీడీవో, తహసీల్దారు కార్యాలయాలకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ చిత్రపటాలను మండల బీజేపీ నాయకులు బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు ముక్కు అయోధ్య రామయ్య, బీజేపీ సీనియర్ నాయకుడు చింతగింజల సుబ్రహ్మణ్యం, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు రాచపూటి ధనుంజయ, పొదలకూరు మండల ఓబీసీ అధ్యక్షుడు సిరిగిరి ఓబులేసు, యువ మోర్చా నాయకుడు పూల ప్రశాంత్, నాయకులు బల్లి పిచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక పాలసీని త్వరగా విడుదల చేయాలి

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 14: ప్రభుత్వం కొత్త ఇసుక పాలసీని త్వరగా విడుదల చేయాలని ట్రాక్టర్ డ్రైవర్లు బుధవారం తహసీల్దారును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ గత 3 నెలలుగా ఇసుక తోలకాలు లేక ఇబ్బందులు పడుతున్నామని తహసీల్దారుకు విన్నవించారు.

స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు చిరస్మరణీయం



మనుబోలు: విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే సోమిరెడ్డి



సైదాపురం : ర్యాలీలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

వెంకటాచలం, ఆగస్టు 14: స్థానిక విక్రమ సింహపురి యూనివర్సిటీలో బుధవారం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. వీసీ డాక్టర్ సారంగం విజయభాస్కరరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి జాతీయ జెండాలను అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి అందజేశారు. అనంతరం 78 అడుగుల త్రివర్ణ పతాకంతో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని, సమరయోధుల త్యాగాలు చిరస్మరణీయం అన్నా రు. ప్రధాని నరేంద్రమోడీ పిలుపు మేరకు ఈనెల 9నుంచి 14వ తేదీ వరకు హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో స్ఫూర్తిదాయకమైన కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ అల్లం ఉదయ్‌శంకర్, డాక్టర్ కే విద్యాప్రభాకర్, డాక్టర్ బీవీ సుబ్బారెడ్డి తది తరులున్నారు.

●**మనుబోలు:** హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు. బుధవారం మనుబోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు పంపిణీచేసేందుకు వచ్చిన ఆయన విద్యార్థులతో కలిసి త్రివర్ణ పతాకం చేతపట్టి భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు.

●**తోటపల్లిగూడూరు:** చెన్నపల్లిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ ఆధ్వర్యంలో బుధవారం గ్రామంలో హర్‌ఘర్ తిరంగా కార్య క్రమం నిర్వహించారు. విద్యార్థుల కోలాట ప్రదర్శన, గుర్రపు స్వారీ విన్యాసాలు అలరించాయి. ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అంద జేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిప్రసాద్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఫణికుమార్, ఉపాధ్యాయులు మోహన్‌ప్రసాద్, ఎస్ జీటీ నాగరాజు, పాఠశాల యాజమాన్యం కమిటీ చైర్మన్ ఠాగూర్ పాల్గొన్నారు.

●**బుచ్చిరెడ్డిపాళెం:** బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు పెనుబల్లి ఎంపీటీసీ చేవూరు వినయ్ నారాయణ అధ్వర్యంలో బుచ్చిరెడ్డిపాళెంలో బుధవారం 300 అడుగుల జాతీయ జెండాతో విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. బుచ్చిలోని పార్కు సెంటర్ నుంచి జాతీయ రహదారిపై వున్న గాంధీబొమ్మ వరకు ర్యాలీ నిర్వహించి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ర్యాలీలో తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లు, బీజేపీ నాయకులు ఇనుగూరు బాలయ్య, నాగవేణి, రమణమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **రాపూరు:** రాపూరులోని జేమ్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో జిలానీబాషా, అమర్‌నాథ్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్, దోడల పెంచలయ్య, కరస్పాండెంట్ మునీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **సైదాపురం:** స్థానిక జెడ్పీ హైస్కూల్ నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సర్కిల్ వరకు భారీ జాతీయ జెండాతో బుధవారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్, ఎంఈవోలు దయాకర్, సురేఖ, ఈవోపీఆర్డీ ఏడుకొండలు, హెచ్ఎం వాసుదేవరావు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధం

కోవూరు: స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణలో గురువారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్ని ఘనంగా నిర్వహించేందుకు బుధవారం అధికారులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు ఏర్పాట్లను సిద్ధం చేశారు. వేడుకల్లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొంటారన్నారు. పలు పాఠశాలల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రిహార్సల్స్ చేశారు. ఏర్పాట్లను బుచ్చిరెడ్డిపాళెం సీఐ హైమారావు, ఎస్ఐ రంగనాథ్‌గౌడ్, పాటూరు జడ్పీ హైస్కూల్ పీఈటీ వెంకటరమణయ్య, టీడీపీ నాయకులు ఇంతా మల్లారెడ్డి, దాసరి మురళి తదిరులు పరిశీలించారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను సద్వినియోగం చేసుకోండి



స్థానికులకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా

నెల్లూరు(క్రైం), ఆగస్టు 14: లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్)తో దొంగతనాలకు చెక్ పెట్టవచ్చని, దీనిని ప్రజలు వినియోగించుకోవాలని నవాబుపేట పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ షేక్ అన్వర్‌బాషా కోరారు. బుధవారం స్టేషన్ పరిధిలోని షిరిడీ సాయి నగర్‌లో నేర నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఇళ్లు విడిచి బయటకు వెళ్లే వారు విధిగా ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. యువత గంజాయికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.

సంతపేట ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాసరావు

నెల్లూరు(క్రైం), ఆగస్టు 14 : సంతపేట పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా మద్ది శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సీఐల బదిలీల్లో భాగంగా సీఐడీలో ఉన్న శ్రీనివాసరావును సంతపేట పోలీసుస్టేషన్‌కు మార్చారు. ఈ క్రమంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ఉన్నతాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ నేర నియంత్రణకు పటిష్ట చర్యలు చేపడుతానని చెప్పారు.

నగర పంచాయతీ అభివృద్ధికి సహకరించండి

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 14: నగర పంచాయతీ అభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అవసరమని కమిషనర్ వెంకట రమణబాబు అన్నారు. నగర పంచాయతీకి పలు రకాల బకాయిలు చెల్లించాల్సిన వారు వెంటనే చెల్లించి మీవంతుగా అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ కోరారు. ఈమేరకు స్థానిక వ్యాపారి మణి బుధవారం రూ.1.5 లక్షలు చెల్లించడంతో కమిషనర్ ఆయన్ను శాలువాతో సత్కరించి అభినందించారు.

'గంజాయికి అడ్డుకట్ట వేయండి'



ఎస్పీతో గునుకుల కిషోర్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 14: నగరంలో స్విగ్గీ ఆర్డర్ల కంటే వేగంగా గంజాయి డెలివరీ అవుతోందని, గంజాయితో యువత మత్తుకు బానిసవు తున్నారని, జిల్లాలో గంజా యిని పూర్తిగా అరికట్టాలని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జీ కృష్ణకాంత్‌ను కలిసి విన్నవించుకున్నారు. ఐదేళ్లుగా గంజాయి వినియోగం ఎంతో పెరిగిందని, కపాడిపాళెం, గుప్తా పార్క్ సెంటర్, సంతపేట, పరమేశ్వరీనగర్, పుత్తా లే అవుట్.. ఇలా అనేక ప్రాంతాల్లో గంజాయి సేవించే అల్లరి మూకలు తిరుగుతున్నాయన్నారు. వెంటనే గంజాయి నిర్మూలనకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

వైసీపీ పాలనలో విద్యారంగం నిర్వీర్యం

● ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

మనుబోలు, ఆగస్టు 14: గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో విద్యారంగాన్ని రాష్ట్రంలో సర్వనాశనం చేశారని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి రాగానే మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్య పుస్తకాలను నిలిపివేసిందని, యువగళంలో ఇచ్చిన హామీ మేరకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ విధానం తీసుకువచ్చారన్నారు. ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలని, గంజాయి, డ్రగ్స్ జోలికి వెళ్ళవద్దన్నారు. కళాశాలలో మధ్యాహ్న భోజనం అమలు, డిగ్రీ కళాశాల ఏర్పాటుపై ప్రభుత్వంతో మాట్లాడతామన్నారు. అంతకుముందు టెన్నికాయిట్ క్రీడలో ప్రథమస్థానం సాధించిన విద్యార్థిని ఎమ్మెల్యే సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీవీఈవో మధుబాబు, ప్రిన్సిపాల్ వేణుగోపాల్, టీడీపీ మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి, నాయకులు పచ్చిపాల రామిరెడ్డి, సాని వెంకటరమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా ముత్తుకూరు మండల సమావేశం

ముత్తుకూరు, ఆగస్టు 14: మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సాధారణ సమావేశం మొక్కుబడిగా జరిగింది. ఎంపీపీ గండవరపు సుగుణ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సభలో అభివృద్ధికి సంబందించిన ఎలాంటి చర్చ జరగలేదు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు, వసతుల కల్పన తదితర అంశాలను చర్చించలేదు. అధిక శాతం ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు వైసీపీకి చెందినవారు కావడంతో శాఖల వారీ సమీక్ష చేపట్టలేదు. ఉన్న కొద్దిమంది అధికార పార్టీకి చెందిన సభ్యులు ఎలాంటి ప్రశ్నలు లేవనెత్తకుండా ఉండడం గమనార్హం.

వరి పొలాల క్షేత్ర సందర్శన

ఇందుకూరుపేట, ఆగస్టు 14: మండలంలోని నరసాపురంలో బుధవారం మండల వ్యవసాయాధికారి డి రఘునాథరెడ్డి వరి పొలాలను క్షేత్ర సందర్శనం చేశారు. రైతుల పొలాల్లో పాము పొడ తెగులు, దోమను గుర్తించి తెగుళ్ల నివారణ చర్యలను రైతులకు వివరించారు. ఎరువులను సిఫారసు మేరకే వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఏఏ పెంచలయ్య, గ్రామ రైతులు పాల్గొన్నారు.

తహసీల్దారుకు సత్కారం

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 14: స్థానిక తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లును బుధవారం పలువురు టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. స్థానికంగా పలు సమస్యలపై ఆయనతో చర్చించారు. తహసీల్దారును కలిసిన వారిలో వింజం రామా నాయుడు, చెంబేటి ప్రసాద్, వల్లెపు దశరథ, తదితరులున్నారు.

పనితీరుతోనే ప్రత్యర్థులకు సమాధానం

● ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న వేమిరెడ్డి దంపతులు

కోవూరు, ఆగస్టు 14: తాము అందుబాటులో ఉండమని ప్రత్యర్థులు చేసిన ప్రచారానికి పనితీరుతోనే సమాధానం చెబుతామని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి అన్నారు. మండల పరిధిలోని లేగుంటపాడు గ్రామంలో బుధవారం సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్ఫూర్తితో నియోజకవర్గ పరిధిలోని నీటిపారుదల కాలువలకు సొంత నిధులతో పూడిక తీయిస్తున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అవినీతి, వివాదరహిత ప్రాంతంగా అభివృద్ధి చేయడమే లక్ష్యం అని, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమన్నారు. అనంతరం అమృతధార వాటర్‌ప్లాంటును ప్రారంభించారు. సీసీ రోడ్డు, రక్షిత మంచినీటి పథకానికి శంకుస్థాపన చేశారు. జడ్పీ పాఠశాల విద్యార్థులకు విద్యాసామాగ్రిని పంపిణీ చేశారు. సర్పంచు జెట్టి రాజగోపాలరెడ్డి అధ్యక్షత వహించిన కార్యక్రమాల్లో ఎంపీపీ తుమ్మలపెంట పార్వతి, టీడీపీ నాయకులు చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, ఇంతా మల్లారెడ్డి, చెముకుల శ్రీనివాసులు, జనసేన నాయకుడు గుడి హరికుమార్‌రెడ్డి, బీజేపీ నాయకులు ఇండ్ల రాఘవేంద్ర, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మాంసం, చేపల అమ్మకాలు నిషేధిస్తూ దుకాణదారులకు నోటీసులు

బుచ్చిరెడ్డిపాళెం,ఆగస్టు14: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో మాంసం, చేపల అమ్మకాలను నిషేధిస్తూ బుధవారం నగర పంచాయతీ కమిషనర్, సిబ్బంది దుకాణదారులకు నోటీసులు జారీచేశారు. జంతు సంరక్షణ సంస్థ వారి సూచనల మేరకు నోటీసులు జారీ చేసినట్టు వారు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరిరిచారు.

రేపటి నుంచి సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు

● నగరంలో బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

నెల్లూరు(వైద్యం) ఆగస్టు 14 : సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు శుక్రవారం నుంచి ఈ నెల 18వ తేదీ వరకు జరుగుతాయని, వీటిని జయప్రదం చేయాలని సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం ఆ యూనియన్ అధ్వర్యంలో నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. దీనిని ఐద్వా జిల్లా కార్యదర్శి షేక్ మస్తానిబీ ప్రారంభించారు. అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానా లను అనుసరిస్తోందని విమర్శించారు. కొత్త నేర చట్టాలతోపాటు నాలుగు లేబర్ చట్టాలు, రోడ్డు రవాణా బిల్లు వంటి కార్మిక వ్యతిరేక చట్టాలను ప్రవేశపెడుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్కీం వర్కర్స్, ఫీల్డ్ అసిస్టెంట్లు, చిరుద్యోగులపై వేధింపులు, అక్రమ తొలగింపులను ఆపాలని కోరారు. రాష్ట్ర రోడ్లపై టోల్‌గేట్లు పెట్టేందుకు ప్రభుత్వం చేస్తున్న ఆలోచనలు విర మించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కత్తి శ్రీనివాసులు, మూలం ప్రసాద్, ఆర్ శ్రీనివాసులు, ఆశోక్, సూర్యనారాయణ. దామోదరరెడ్డి, వేణు, కామాక్షమ్మ, మల్లెమ్మ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల వినియోగం ప్రాణాంతకం

● సీనియర్ సివిల్ జడ్జి చైతన్య

కోవూరు, ఆగస్టు 14: మాదక ద్రవ్యాల వినియోగం ప్రాణాంతకమని సీనియర్ సివిల్ జడ్జి చైతన్య అన్నారు. ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. నల్లమందు, హెరాయిన్, మార్ఫిన్, గంజాయి వాడకం వల్ల నాడీ మండల వ్యవస్థ దెబ్బతింటుందని, మానసికంగా, శారీరకంగా శక్తిని కోల్పోతారని చెప్పారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ సదస్సులో ఎక్సయిజ్ సీఐ జీవీ ప్రసాద్, లీగల్ సర్వీసెస్ అథారిటీ కమిటీ సభ్యుడు రాంబాబు మాట్లాడారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి చైతన్యను కళాశాల అధ్యాపకులు సన్మానించారు.

17న లక్ష తులసీ దళార్చన

నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 14 : నగరంలోని శబరి శ్రీరామక్షేత్రం 24వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 17వతేదీ ఉదయం 8గంటలకు సామూహికంగా లక్ష తులసీదళార్చన జరుగుతుందని ఆలయ చైర్మన్ చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉద యం 6గంటలకు కోదండరామస్వామికి విశేష పంచామృతాభిషేకాలు, 11.30గంటలకు పూర్ణాహుతి, తీర్థ ప్రసాద వినియోగం జరుగుతాయన్నారు. సాయంత్రం 5.30గంటలకు సీతా రామ కల్యాణం, 7.30గంటలకు పల్లకిసేవ జరుగుతాయని, భక్తులు తరలిరావాలని కోరారు.

దేవుడి పందిరి కూల్చివేతపై ఫిర్యాదు

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 14: మండలంలోని చెల్లాయపాళెం పల్లిపాళెంలో ఆంజనేయస్వామి విగ్రహం వద్ద భక్తులు భజనలు చేసుకునేందుకు వేసిన పందిరిని బుధవారం మధ్యాహ్నం కొందరు కూల్చేశారని స్థల దాత తమ్మిరెడ్డి మల్లికార్జున బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. భక్తులు భజనలు చేసుకునే పందిరిని కూల్చేవేయడంపై విచారించి న్యాయం చేయాలని కోరారు. అదేవిధంగా స్థానిక పంచాయతీ అధికారులకు కూడా ఆయన ఫిర్యాదు చేశారు.

గేదెల చోరీపై ఫిర్యాదు

పొదలకూరు, ఆగస్టు 14: మండలంలోని చెర్లోపల్లి గ్రామానికి చెందిన పాడిరైతు రామయ్య తన నాలుగు గేదెలు చోరీకి గురయ్యాయని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డివామి దగ్ధం

మనుబోలు, ఆగస్టు 14: స్థానిక కోదండరామపురంలో బుధవారం కందల శ్రీనువాసులుకు చెందిన గడ్డివామి దగ్ధమైంది. శ్రీనువాసులు ఇంటి ఆవరణలో ఉన్న గడ్డివామిపై గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు వేయడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించి గడ్డివామి అగ్నికి ఆహుతైంది. గూడూరు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదం వలన తనకు రూ.70వేలు ఆస్తినష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

యువకుడిపై హత్యాయత్నం

నెల్లూరు(క్రైం), ఆగస్టు 14: పాతకక్షల నేపథ్యంలో ఓ యువకుడిపై కొందరు హత్యాయత్నానికి పాల్పడ్డట్లు నెల్లూరులోని చిన్నబజారు స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి... నగరంలోని హరనాథపురం సర్వేపల్లి కాలువ కట్టకు చెందిన శ్రీనివాసులు పెయింటర్‌గా జీవిస్తున్నాడు. ఆయనకు అదే ప్రాంతానికి చెందిన నితిన్, కిరణ్, తేజా స్నేహితులు. మూడు నెలల కిందట స్నేహితుల మధ్య మనస్పర్థలు చోటు చేసుకున్నాయి. అప్పటి నుంచి వారు శ్రీనివాసులుపై కక్ష పెంచుకున్నారు. ఇదిలా ఉండగా బుధవారం శ్రీనివాసులు పనికి వెళ్లలేదు. దీంతో అతనిని తల్లి మందలించింది. మనస్థాపానికి లోనైన శ్రీనివాసులు బ్లేడ్‌తో కుడి చేతిపై కోసుకోవడంతో తీవ్ర రక్తస్రావమైంది. కుటుంబ సభ్యులు గమనించి జయభారత్ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. తిరిగి ఆటోలో ఇంటికి వెళుతుండగా స్నేహితులు అడ్డగించి బీరు బాటిళ్లతో దాడి చేశారు. శ్రీనివాసులు తమ్ముడు ముకేష్ బాబు, మరో వ్యక్తి అడ్డుకోవడంతో నిందితులు పరారయ్యారు. తీవ్ర గాయాలపాలైన శ్రీనివాసులు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ముకేష్ బాబు ఫిర్యాదుతో చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు హత్యాయత్నం కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.



10వ ఆంధ్ర నేవెల్ యూనిట్ ప్రదర్శన

ఘనంగా హర్ ఘర్ తిరంగా

- పలు విద్యా సంస్థల ర్యాలీ

నెల్లూరు (విద్య), ఆగస్టు 14: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపుమేరకు పలు విద్యాసంస్థలు హర్ ఘర్ తిరంగా వేడుకలను బుధవారం నగరంలో నిర్వహించాయి.

- నారాయణ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టారు. 200 అడుగుల జాతీయ పతాకంతో ట్రంకురోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం నుంచి గాంధీబొమ్మ మీదుగా తిరిగి అంబేడ్కర్ విగ్రహం వరకు విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. ఆ కళాశాల డైరెక్టర్ డాక్టర్ బీ దత్తాత్రేయశర్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ జీ శ్రీనివాసులురెడ్డి, అకడమిక్ డీన్ విశ్వక్‌సేనారెడ్డి, ఏజీఎం బీవీ శ్రీధర్, పీడీ ప్రసాద్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ మోహన్‌రెడ్డి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.
- 10 ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గొదంగవే ఆదేశాల మేరకు నగరంలోని కేఎన్ఆర్ నగరపాలక ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ కేడెట్లు ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి అంటూ నినాదాలు చేస్తూ పాఠశాల నుంచి కరెంట్ ఆఫీస్ సెంటర్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. పటేల్ విగ్రహానికి నివాళులర్పించారు. ఎన్‌సీసీ సెకండ్ ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు మాట్లాడుతూ దేశంకోసం ప్రాణాలను అర్పించిన అమరవీరుల అడుగుజాడల్లో నడిచేలా కేడెట్లను తీర్చిదిద్దుతున్నామన్నారు. బాల్యం నుంచే విద్యార్థుల్లో దేశభక్తిని నింపేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.
- ఆర్ఎస్ఆర్ మునిసిపల్ ఉన్నత పాఠశాల, సీబీ నగర్ మునిసిపల్ ఉన్నత పాఠశాలలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్స్ ఆధ్వర్యంలోనూ ర్యాలీ నిర్వహించారు. స్టోన్‌హౌస్‌పేట, నవాబుపేట ప్రాంతాల్లో అన్ని వీధుల్లో ర్యాలీ నిర్వహించి జాతీయ జెండా ప్రతి ఇంటిపై ఎగరాలి అని నినదించారు. ప్రధానోపాధ్యాయులు మధుసూదన్‌బాబు, జాస్మినమ్మ, ఆర్మీ స్టాఫ్ హవల్దార్ దొరబాబు, ఎన్‌సీసీ చీఫ్ ఆఫీసర్ బాలబ్రహ్మాచారి, సుజన, చిన్నయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి : యూటీఎఫ్



రూరల్ ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

నెల్లూరు (విద్య), ఆగస్టు 14: ఉపాధ్యాయులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. ప్రభుత్వ విద్యారంగంలోని సమస్యల పరిష్కారానికి చేపట్టిన దశలవారీ పోరాటంలో భాగంగా బుధవారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి వినతిపత్రం అందచేశారు. ప్రాథమిక పాఠశాలల్లో 1 నుంచి 5 వరకు తరగతులు నిర్వహించేలా, అన్ని పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లీష్ మీడియం కొనసాగేలా నిర్ణయాలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలతోపాటు ప్రాథమిక విద్యను పరిరక్షించేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ నవకోటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ చలపతిశర్మ, అసోసియేట్ అధ్యక్షుడు ఎంసీ అచ్చయ్య, కోశాధికారి మురళీధర్‌రావు, కార్యదర్శులు నాగిరెడ్డి, ఖాజావలి, సురేంద్రబాబు, దయాకర్ పాల్గొన్నారు.

- **ఆక్రమణలు తొలగించి, డ్రైన్లు నిర్మిస్తాం**

నెల్లూరు రూరల్ : నగరంలోని మాగుంట లేఅవుట్, గోమతి నగర్‌లో ఇరిగేషన్ స్థలాలను ఆక్రమించి డ్రైనేజీ మురుగు బయటకు వెళ్లనివ్వకుండా బడాబాబులు నిర్మాణాలు చేపట్టారని, వాటిని తొలగించి నూతన డ్రైన్లు నిర్మిస్తామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం 19వ డివిజన్‌లో రూ.35 లక్షలతో సీసీరోడ్లు, డ్రైన్ల నిర్మాణా లను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, కార్పొరేటర్ జ్యోతిప్రియ, నాయకులు మదన్‌కుమార్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, జయచంద్ర పాల్గొన్నారు.

బీటీఏ నగరాధ్యక్షుడిగా పెంచల ప్రసాద్



డీఈవోకు వినతిపత్రం అందచేస్తున్న నాయకులు

నెల్లూరు (విద్య), ఆగస్టు 14: బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) నగర అధ్యక్షుడిగా ఎల్ పెంచల ప్రసాద్ ఎన్నికయ్యారు. నగరంలోని బీటీఏ జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగిన సబ్ కమిటీ సమావేశంలో నూతన అధ్యక్షుడిని ఆయనను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. జిల్లా నేతలు మాట్లాడుతూ బీటీఏ నగర సభ్యుడైన కోలా కిరణ్‌కుమార్ సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటంతో ఆయనను సంఘం నుంచి తొలగిస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు నగరాధ్యక్షుడిగా ఉన్న షేక్ ఖాజా రహంతుల్లాను జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా ఎంపిక చేసి నూతన అధ్యక్షుడిని నియమించినట్లు చెప్పారు. అనంతరం అసోసియేషన్ నేతలు విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో రామారావును కలిసి వినతిపత్రం అందచేశారు. ఉపాధ్యా యుల పని సర్దుబాటు విధానాన్ని సక్రమంగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పల్లం వేణు గోపాల్, కోశాధికారి పీ ఆదినారాయణ, కార్యదర్శులు బీ భాస్కర్, రఘు, తిరుపతయ్య, హరి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేని కలిసిన ఎస్ఎంసీ చైర్మన్‌లు



కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని కలిసిన ఎస్ఎంసీ చైర్మన్‌లు, వైస్‌చైర్మన్‌లు

విడవలూరు, ఆగస్టు 14 : మండల పరిధి లోని దంపూరు గ్రామంలో ఉన్న ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో జరిగిన ఎస్ఎంసీ ఎన్నికల్లో గెలుపొందిన చైర్మన్‌లు రవి, ఎన్ లావణ్య, శైలజ, వైస్ చైర్మన్‌లు లక్ష్మీ, ఎస్‌కె సమీర్, కీర్తిలు స్థానిక టీడీపీ నాయకులు దూది విజయరాఘవన్, చేవూరు రాంప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు భార్గవ్, వాసు, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి దారుణ హత్య



వేణు మృతదేహం

నెల్లూరు(క్రైం): నెల్లూరులోని బీవీ నగర్ రైల్వే గేటు సమీపంలో ఓ యువకుడిని బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. పోలీసులు సమాచారం మేరకు.... కావలికి చెందిన ఏడుకొండలు కుమారుడు మన్నేపల్లి వేణు(23) చిన్నతనం నుంచి నెల్లూరు నగరంలోని బీవీ నగర్‌లో ఉన్న అమ్మమ్మ హజరత్తమ్మ ఇంట్లో ఉంటున్నాడు. బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వేణు అందరితో కలివిడిగా ఉండేవాడు. అయితే కారణాలు తెలియదుగానీ బుధవారం అర్ధరాత్రి రైల్వేగేటు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు అతనిపై కత్తితో దాడిచేసి హత్య చేశారు. గమనించిన స్థానికులు రక్తపుమడుగులో ఉన్న వేణును గుర్తించి వేదాయపాళెం పోలీసులకు సమాచారం అందించారు. ఇన్‌స్పెక్టర్ టీవీ సుబ్బారావు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీనియర్ విద్యార్థిపై జూనియర్ల దాడి

నెల్లూరు(క్రైం), ఆగస్టు14: మద్యం సేవించేందుకు డబ్బు ఇవ్వలేదన్న కోపంతో సీనియర్ విద్యార్థిపై జూనియర్ విద్యార్థులు దాడి చేసిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి... బుచ్చిరెడ్డిపాళెం మండలం దామరమడుగుకు చెందిన షేక్ అషరద్‌బాషా నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. ఆరు నెలలుగా అతను కళాశాలకు వెళ్లకుండా రాంజీనగర్‌లోని రిలయన్స్ మార్ట్‌లో పని చేస్తున్నాడు. ఈనెల 12వతేదీ ఆయన స్నేహితుడిని కలిసేందుకు కళాశాల సమీపంలోని కేఫ్ వద్దకు వెళ్లాడు. అదే కళాశాలలో చదువుతున్న అతని జూనియర్లు కైఫ్ మన్సూర్, ముజమిల్, షాహల్ కూడా ఆ కేఫ్ వద్దకు వచ్చారు. మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వాలని అషరద్ బాషాను కోరగా అతని వద్ద లేదని చెప్పడంతో ఇటుక రాయితో దాడి చేశారు. గాయాలపాలైన అషరద్‌బాషా జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. బుధవారం బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు దర్యాప్తు చేస్తున్నారు.

ఐదేళ్ల తర్వాత స్వేచ్ఛా వాయువులు!



● వైసీపీ పాలనలో ఆంక్షలు, అణచివేతలతో అన్ని వర్గాల ప్రజలూ సతమతం

తిరుపతి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నేటి స్వాతంత్ర దినోత్సవ సంబరాలు జిల్లా ప్రజలకు మాత్రం ప్రత్యేకమైనవనే చెప్పాలి. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ళ పాటు అడుగడుగునా ఆంక్షలు, అణచివేతలతో జిల్లా ప్రజలు విసిగిపోయారు. ప్రతిపక్ష రాజకీయ పార్టీల శ్రేణులకు గడచిన ఐదేళ్ళ కాలం పీడకలగా పరిణమించింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నోరెత్తనివ్వలేదు. కనీసం తమ న్యాయమైన కోరికలు నెరవేర్చాలని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు గట్టిగా డిమాండ్ వినిపించలేని దుస్థితి నెలకొంది.ఛలో విజయవాడకు బయల్దేరిన అంగన్‌వాడీ వర్కర్లను మార్గమధ్యంలో అర్ధరాత్రి నిర్జన ప్రాంతాల్లో బస్సుల్లోంచి దింపేసిన అమానవీయ ఘటనలు జరిగాయి. విపక్ష శ్రేణులు మొదలుకుని వామపక్షాల వరకూ అందరి గొంతులూ మూగబోయాయి. స్థానిక ఎన్నికల్లో విపక్ష అభ్యర్థులు నామినేషన్లు కూడా దాఖలు చేయలేని దురవస్థ అలుముకుంది. వైసీపీ నేతలు, కార్యకర్తలు వారి నుంచీ నామినేషన్ పత్రాలు గుంజుకుని చింపేసిన సందర్భాలు, దాడులు జరిపి తరిమివేసిన ఘటనలూ అనేకం. చివరికి అధికార పార్టీకి చెందిన రెబల్ అభ్యర్థులకు సైతం ఇదే చేదు అనుభవం ఎదురైంది.చివరికి ఆయన మరో విమానంలో హైదరాబాదు వెనుదిరగాల్సి వచ్చింది. బలమైన రాజకీయ పక్షమైన టీడీపీ యువనేత నారా లోకేశ్ యువగళం వినిపించేందుకు రోడ్డెక్కడానికి సైతం ఆంక్షలు ఎదురయ్యాయి. కార్యకర్తలు మొదలు జిల్లా నేతలు సైతం హౌస్ అరెస్టుల పేరిట నిర్బంధాలు ఎదుర్కొన్నారు.నారా లోకేశ్‌పై సైతం పలు కేసులు పెట్టారు. ఆయన కనీసం స్టూలుపై కూడా నిల్చోకుండా ఆంక్షలు విధించారు.రాష్ట్రానికి 14 ఏళ్ళ పాటు సీఎంగా పనిచేసిన టీడీపీ అధినేత చంద్రబాబు 2021 మార్చి 1న తిరుపతి విమానాశ్రయం దాటి వెలుపలికి రాకుండా ఒక రోజంతా పోలీసు ఆంక్షలకు గురయ్యారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో టీడీపీ కార్యకర్తలు, నాయకులపై వైసీపీ దాడులు దౌర్జన్యాలపై చిత్తూరు కలెక్టర్, ఎస్పీలను కలిసేందుకు విమానంలో తిరుపతి వచ్చిన ఆయనను పోలీసులు వెలుపలికి రానివ్వలేదు.అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైసీపీ నేతలు దాడులు, దౌర్జన్యాలు, కబ్జాలతో చెలరేగిన వైనం సామాన్య జనానికి నిదుర లేని రాత్రుల్ని మిగిల్చింది. తిరుపతి నగరంలో ఇంటి స్థలాలను, భూములను కాపాడుకోవడం యజమానులకు అలవికాని పనిగా మారింది. ఏ రాత్రి ఎవరొచ్చి స్థలాలు ఆక్రమించి కంచె వేస్తారో, భూములు కట్టేస్తారోనని నిద్ర లేని రాత్రులు గడపాల్సి వచ్చింది. ఎంతోమంది రూ. కోట్ల విలువైన స్థలాలు కోల్పోయారు కూడా. రెవిన్యూ, పోలీసు విభాగాల్లో ఎవరిని ఆశ్రయించినా న్యాయం జరిగిన దాఖలాల్లేవు. చివరికి విదేశాల్లో ఉద్యోగాలు చేసుకునే ప్రవాసులు సైతం అక్కడి నుంచే వీడియోల ద్వారా తమ ఆవేదన వెళ్ళగక్కిన ఉదంతాలూ అనేకం వున్నాయి. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ళ దహనం ఘటన తర్వాత తమ భూములు కబ్జా అయ్యాయని, బలవంతంగా గుంజుకున్నారని ఆరోపిస్తూ బాధితులు వేల సంఖ్యలో క్యూ కడుతుండడమే దీనికి నిదర్శనం.ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలతో ప్రభుత్వం మారడంతో అన్ని వర్గాల ప్రజానీకం ఊపిరి పీల్చుకున్నారు.గత ఐదేళ్ళుగా దూరమైన స్వేచ్ఛను తిరిగి పొందుతున్నట్టు ప్రజలు భావిస్తున్నారంటే అతిశయోక్తి కాదు.అందుకే నేటి స్వాతంత్ర దినోత్సవం జిల్లా ప్రజల పాలిట నిజంగా సంబరం.

పడవలో జెండాల సందడి

స్వాతంత్ర్యదినోత్సవాన్ని పురస్కరించుకొని తడ మండలంలోని ఇరకందీవి విద్యార్థులు పులికాట్ సరస్సులో పడవపై పాఠశాలలకు వెళ్తూ జాతీయ జెండాలను చేతబూని సందడి చేశారు.భారత్‌మాతాకూ జై అంటూ నినాదాలు చేశారు.

- తడ

133 అడుగుల పతాకం



తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోని కేవీఎస్ స్పోర్ట్స్ పార్క్‌లో 133అడుగుల ఎత్తులో వుడెన్‌ఫోల్‌పై ఎగురుతున్న అతి పెద్ద మువ్వన్నెల జాతీయజెండా చూపరులను ఆకట్టుకుంటోంది. బర్మా టేకుతో వుడెన్‌ఫోల్‌పై చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ త్రివర్ణపతాకాన్ని 20అడుగుల ఎత్తు..30అడుగల వెడల్పుతో స్తంభానికి జోడించి వుంచారు. ప్రముఖ ఆర్కిటెక్చర్ల పర్యవేక్షణలో 5నెలలపాటు 50మంది కార్మికులు శ్రమించి తయారు చేసిన ఈ జెండాకు బుధవారం గౌరవ వందనం సమర్పించనున్నారు. ఇప్పటివరకు ఢిల్లీలోని రాష్ట్రపతిభవన్‌లో మాత్రమే 120అడుగుల ఎత్తులో జాతీయజెండా కనబడుతుండగా.. ఇప్పుడు తిరుపతిలో 133అడుగుల ఎత్తులో జాతీయజెండా కనిపిస్తుండడం విశేషం. **- తిరుపతి రూరల్**



స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గూడూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో జాతీయ నాయకుల సైకతశిల్పాలను రూపొందించిన సనత్‌కుమార్ -గూడూరు

సీఐ దాసరి గంగరాజుకు రాష్ట్రపతి అవార్డు



తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 14:వెంకటగిరి ఏపీఎస్పీ బెటాలియన్‌లో రిజర్వు సీఐగా పనిచేస్తున్న దాసరి గంగరాజు రాష్ట్రపతి అవార్డుకు ఎంపికయ్యారు.స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ఈ ఏడాది విజయవాడలో ఐజీగా పనిచేస్తున్న రవిప్రకాష్‌గంగరాజులను మాత్రమే ప్రభుత్వం ఎంపిక చేసింది.తూర్పు గోదావరి జిల్లా పెద్దబ్రహ్మదేవం గ్రామానికి చెందిన గంగరాజు 1998లో రిజర్వు ఎస్‌ఐగా పోలీసు శాఖలో చేరారు. ఏపీ పోలీసు అకాడమీలో పనిచేశాక టీటీడీకి బదిలీపై వచ్చి ఐదేళ్ళ పాటు ఏవీఎస్వోగా పనిచేశారు.ఇటీవల జరిగిన బదిలీల్లో వెంకటగిరి ఏపీఎస్పీ బెటాలియన్‌కు బదిలీ అయ్యారు.అవార్డు ప్రకటించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014లో ఇండియన్ పోలీసు మెడల్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబునుంచి అందుకున్నానని చెప్పారు.రాష్ట్రపతి అవార్డు రావడం పట్ల చాలా సంతోషంగా వుందని చెప్పారు.

పోలీసు మైదానంలో రిహార్సల్స్



పోలీసు కవాతు రిహార్సల్స్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 14: తిరుపతిలో గురువారం జరగనున్న స్వాతంత్ర దిన వేడుకలకు జిల్లా పోలీసు పెరేడ్ మైదానం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది.బుధవారం పోలీసు కవాతు రిహార్సల్స్‌ను కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు పర్యవేక్షించారు. జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం చేశారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, కమిషనర్ మౌర్య, అదనపు ఎస్పీలు పాల్గొన్నారు.

6 శకటాలు, 66 స్టాళ్లు

తిరుపతి(విద్య), ఆగస్టు 14: తిరుపతి పోలీస్ పరేడ్ మైదానంలో నేడు జరగనున్న స్వాతంత్ర్య దిన వేడుకల్లో ఆరు శకటాలు పాల్గొంటాయి.పరిశ్రమల శాఖ, వ్యవసాయ, విద్య, డీఆర్‌డీఏ, పోలీస్, తిరుపతి మున్సిపాలిటీలకు సంబంధించిన శకటాలను ఆయా శాఖలు సిద్ధం చేశాయి. ఆయా శాఖల్లో సాధించిన ప్రగతిని వివరించేలా రూపొందించిన శకటాలు ప్రదర్శనలో సభికుల ముందుకు రానున్నాయి. అలాగే పోలీసు శాఖ కూడా ఓ స్టాల్‌ను ఏర్పాటు చేయనుంది. డీఆర్‌డీఏ 2, మహిళా, శిశు సంక్షేమశాఖ 3, పీడీ, మెప్మా శాఖలు 4, వ్యవసాయ శాఖ 5, హార్టికల్చర్ 6, సెరికల్చర్ 7, వైద్య శాఖ 8, టూరిజం 9, అటవీశాఖ 10, యానిమల్ హస్బెండరీ శాఖ 11 స్టాళ్ల ఏర్పాటు చేశాయి.

షార్‌లో ఉత్సవాలకు ఇస్రో చైర్మన్

సూళ్లూరుపేట, ఆగస్టు 14:శ్రీహరికోటలోని అంతరిక్ష కేంద్రీయ పాఠశాల మైదానంలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవాలకు ఇస్రో చైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ హాజరు కానున్నట్లు అధికారులు తెలిపారు. జాతీయ పతాకాన్ని ఆయన ఎగురవేయనున్నారు.శుక్రవారం షార్ వేదికగా ప్రయోగించే ఎస్ఎస్ఎల్వీ-డీ 3 రాకెట్ ప్రయోగ ఏర్పాట్లలో శాస్త్రవేత్తలతో కలిసి పాలుపంచుకోనున్నారు.

తిరుపతి మాజీ కమిషనర్ హరితపై వేటు

● టీడీఆర్ ఎఫెక్ట్



● అనంతపురం జేసీ నియామకం రద్దు
● జీఏడీకి రిపోర్ట్ చేయాలని ఆదేశం

తిరుపతి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో తిరుపతి కార్పొరేషన్లో జరిగిన టీడీఆర్ బాండ్ల కుంభకోణంలో బాధ్యులపై చర్యలు మొదలయ్యాయా? తిరుపతి కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేసిన ఐఏఎస్ అధికారి డి. హరితకు అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఇచ్చిన నియామకాన్ని రద్దు చేస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా ఉన్న బాలసుబ్రమణ్యాన్ని మంగళవారం బదిలీ చేయడం కూడా ఇందులో భాగమేనంటున్నారు.ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన ఐఏఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా హరిత ఐటీడీఏ(కేఆర్‌పురం)ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. అయితే ఆమె బాధ్యతలు తీసుకోకుండా సెలవులో ఉన్నారు. ఈక్రమంలో గతవారం జరిగిన ఐఏఎస్ అధికారుల బదిలీల్లో అనంతపురం జేసీగా నియమించడంతో బాధ్యతలు తీసుకునేందుకు సన్నద్ధం అవుతుండగా టీడీఆర్ బాండ్లపై విచారణ అంశం తెరపైకి వచ్చినట్లు తెలిసింది. దీంతో ఆమె నియామకాన్ని రద్దు చేస్తూ, సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ)లో రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. గతంలో తిరుపతి కమిషనర్‌గా ఉన్నప్పుడు టీడీఆర్ బాండ్ల జారీలో ఆమె పాత్రమై కూడా ఆరోపణలు వచ్చాయి.వ్యవసాయ భూమిని, రెసిడెన్షియల్ ప్లాట్లను కమర్షియల్ స్థలాలుగా చూపి మాస్టర్ ప్లాన్ రోడ్ల కోసం సేకరించారన్న విమర్శలున్నాయి. ఈ క్రమంలో కోట్లాది రూపాయలు టీడీఆర్ బాండ్ల రూపంలో చెల్లించాల్సి వచ్చింది. అదేవిధంగా స్థల యజమానికి కాకుండా వేరే వ్యక్తుల పేరిట బాండ్లను జారీ చేశారన్న ఆరోపణలు వచ్చాయి. స్థల యజమానులకు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా రోడ్డు విస్తరణ చేయడం, కోర్టు ఆదేశాలను కూడా లెక్కచేయకుండా దూకుడుగా వ్యవహరించారని చెబుతారు. ఈ నేపథ్యంలో టీటీడీ మాజీ చైర్మన్ చదలవాడ కృష్ణమూర్తి కూడా తన గ్రూప్ థియేటర్స్ గోడను కూల్చడంపై కూడా హైకోర్టు ఆదేశాలను లెక్కచేయలేదంటూ ఆమె కోర్టు ధిక్కరణ నోటీసులు అందుకోవాల్సి వచ్చింది. అదేవిధంగా ఆమె కుటుంబ సభ్యుల ఇళ్లు, ఆస్తుల కోసమే నగరంలో పలు రోడ్లు వేశారన్న విమర్శలు కూడా ఎదురయ్యాయి. అప్పటి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, డిప్యూటీ మేయర్ అభినయ్‌లతో అంటకాగారన్న విమర్శలు ఉన్నాయి. వారు చెప్పిందంతా చేయడం వల్లనే ఆమెకు ఇప్పుడు విచారణను ఎదుర్కొనే పరిస్థితి వచ్చిందన్న చర్చ జరుగుతోంది. ఇదిలావుంటే తాజాగా 'ఆమె టీడీఆర్ బాండ్ల రూపశిల్పి. నెల్లూరు మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసినప్పుడు నేను చూసిన ఐఏఎస్ అధికారుల్లో హరిత అత్యంత అవినీతిపరురాలు' అని తన 'ఎక్స్'లో టీడీపీ నేత ఆనం వెంకటరమణా రెడ్డి బుధవారం పోస్టు చేయడం విశేషం.

అన్నా క్యాంటీన్ల ప్రారంభం రెండవ దశకు వాయిదా

తిరుపతి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆకలి తీర్చేందుకు ఉద్దేశించిన ప్రతిష్టాత్మక అన్నా క్యాంటీన్ల ప్రారంభోత్సవం జిల్లాలో రెండవ దశకు వాయిదా పడింది. గత టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన అన్నా క్యాంటీన్లు పట్టణ, నగర ప్రాంతాల్లో పేద విద్యార్థులు, కూలీలు, నిరుపేదలు, ఆస్పత్రులకు వచ్చే రోగుల సహాయకులకు అమితంగా ఉపయోగపడిన సంగతి తెలిసిందే. పట్టణ ప్రాంత పేద, దిగువ మధ్య తరగతి ప్రజల మనసులు చూరగొన్న ఈ పథకాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా అటకెక్కించింది. అన్నా క్యాంటీన్లను వార్డు సచివాలయాలుగా, అర్బన్ హెల్త్ సెంటర్లుగా, గ్రీవెన్స్ విభాగాలుగా మార్చివేశారు. గత ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే తిరిగి అన్నా క్యాంటీన్లు తెరిచి నిర్వహిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక ఆ హామీని నిలబెట్టుకునే దిశగా నేడు రాష్ట్రవ్యాప్తంగా వంద అన్నా క్యాంటీన్లు ప్రారంభిస్తున్నారు. అయితే వివిధ కారణాల రీత్యా జిల్లాలో మాత్రం అన్నా క్యాంటీన్లను ఈ తొలి విడత ప్రారంభించడం లేదు. రెండవ దశలో ప్రారంభించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. గతంలో తిరుపతి నగరంలో నాలుగు, శ్రీకాళహస్తిలో రెండు, గూడూరులో ఒకటి, వెంకటగిరిలో ఒకటి, నాయుడుపేటలో ఒకటి, సూళ్ళూరుపేటలో ఒకటి చొప్పున మొత్తం పది క్యాంటీన్లు నడిచాయి. ఇపుడు ఆ పదింటితో పాటు పుత్తూరులో ఒక క్యాంటీన్ తెరిసి 11 క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నారు. అయితే వీటిని రెండవ దశలో ప్రారంభించనున్నారు.

శ్రీకాళహస్తి, సత్యవేడు, చంద్రగిరిల్లో


ఆగిన ఇసుక తవ్వకాలు

● అనధికారిక రీచ్‌లను తనిఖీ చేసిన అధికారులు ● 13 ఇసుక ట్రాక్టర్లు సీజ్

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తిరుపతి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి, సత్యవేడు, చంద్రగిరి నియోజకవర్గాల్లో ఇసుక తవ్వకాలు బుధవారం ఆగిపోయాయి. ఈ నియోజకవర్గాల్లోని అనధికారిక ఇసుక రీచ్‌లను సంబంధిత శాఖల అధికారులు, ఉద్యోగులు తనిఖీ చేశారు. ఇసుక తరలిస్తున్న 13 ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఆగని ఇసుక దోపిడీ శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంతో అధికారులు స్పందించారు. అయితే అధికారుల చర్యలు బుధవారానికి మాత్రమే పరిమితమా లేక నిరంతరంగా కొనసాగుతాయా అన్నది వేచి చూడాల్సి వుంది.

తొట్టంబేడు మండలంలోని విరూపాక్షపురం, పెన్నలపాడు గ్రామాల వద్ద స్వర్ణముఖి నదిలో భారీ ఎత్తున సాగుతున్న ఇసుక దోపిడీకి బుధవారం తాత్కాలికంగా అడ్డుకట్ట పడింది. ఈ రెండు ప్రాంతాలను తహసిల్దారు మధుసూదన రావు తనిఖీ చేశారు. శ్రీకాళహస్తి ఎస్ఈబీ సీఐ దశరధరామిరెడ్డి సిబ్బందితో కలసి తనిఖీలు చేపట్టి రెండు ట్రాక్టర్లను సీజ్ చేశారు. శ్రీకాళహస్తి మండల పరిధిలో ఇసుక తవ్వకాలు జరిగే ప్రదేశాలను ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి తనిఖీ చేశారు. నాగలాపురం, పిచ్చాటూరు మండలాల్లో ఇసుక తవ్వకాలు జరుపుతున్న ప్రాంతాల్లో రెవిన్యూ, పోలీసు, సెబ్ బృందాలు తనిఖీ చేశాయి. చంద్రగిరి మండలంలో ఇసుక తవ్వకాలు జరిగే తొమ్మిది ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9.30 గంటల వరకూ తవ్వకాలు యధావిధిగా కొనసాగాయి. ఆ తర్వాత సెబ్, పోలీసు, రెవిన్యూ, సచివాలయ సిబ్బంది తనిఖీలు చేసి తవ్వకాలను నిలిపివేయించారు. దీనిపై తహసిల్దారు శివరామ సుబ్బయ్య మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవ ఏర్పాట్ల కారణంగా తాను తనిఖీలకు వెళ్ళలేదని చెప్పారు. సంబంధిత వీఆర్వోలు ఈనెల 16వ తేదీ నుంచీ ఇసుక తవ్వకాలు జరిగే ప్రాంతాలపై నిఘా వుంచుతారని చెప్పారు. తిరుపతి రూరల్ మండలంలో సెబ్ అధికారులు తనిఖీలు చేపట్టి ఐదు ట్రాక్టర్లను సీజ్ చేశారు. జిల్లా మొత్తం మీద 13 ట్రాక్టర్లు సీజ్ చేసినట్టు సెబ్ అధికారులు వెల్లడించారు. వీటిలోని 60 టన్నుల ఇసుకను కూడా సీజ్ చేసినట్టు చెప్పారు. సీజ్ చేసిన ట్రాక్టర్లను తిరుపతి ఈస్ట్, తిరుపతి రూరల్, అలిపిరి, తొట్టంబేడు పోలీసు స్టేషన్లలో అప్పగించామని చెప్పారు.



విరూపాక్షపురం వద్ద ఇసుక ట్రాక్టర్ సీజ్

డక్కిలి మాజీ ఎంపీపీ కన్నుమూత

- నివాళులర్పించిన సోమిరెడ్డి, కురుగొండ్ల
- దిగ్భ్రాంతిని కలిగించిందన్న నటి శారద

డక్కిలి, ఆగస్టు 14: డక్కిలి మాజీ ఎంపీపీ, టీడీపీ సీనియర్ నాయకుడు పోలంరెడ్డి వెంకటరెడ్డి(78) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. వెంకటగిరిలో తన కుమార్తె ఇంట్లో ఉంటున్న ఆయన ఉదయం 10 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో ఆయన్ను సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించడంతో భౌతిక కాయాలన్ని ఆయన స్వగ్రామమైన మాటుమడుగుకు తరలించారు. టీడీపీ ఆవిర్భవించిన నాటి నుంచి తుదిశ్వాస వరకు వెంకటరెడ్డి డక్కిలి మండల టీడీపీ అధ్యక్షుడిగా పనిచేశారు. 1994 నుంచి 1998 వరకు మోపూరు పీఏసీఎస్ ఛైర్మన్‌గా, జిల్లా సెంట్రల్ బ్యాంకు డైరక్టరుగా పని చేశారు. 2001నుంచి 2006 వరకు మాటుమడుగు సర్పంచ్‌గా, 2014 నుంచి 2019వరకు డక్కిలి ఎంపీపీగా వ్యవహరించారు. వెంకటరెడ్డి మృతి టీడీపీకి తీరని లోటని , దాన్ని ఎవ్వరూ పూడ్చలేరని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. బుధవారం వారు వెంకటరెడ్డి పార్థివదేహానికి నివాళి అర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... వెంకటరెడ్డి కుటుంబానికి మనోధైర్యం కల్పించాలని భగవంతుడిని కోరుకుంటున్నట్లు తెలిపారు. టీడీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి గంగోటి నాగేశ్వరరావు, వెంకటగిరి వ్యవసాయ మార్కెటింగ్ మాజీ ఛైర్మన్ పి.రాజేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ దొంతు శారద బాలకృష్ణ, తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీకే ప్రసాద్ నాయుడు, తిరుపతి పార్లమెంటు టీడీపీ వాణిజ్య విభాగ అధ్యక్షుడు పి.విశ్వనాథనాయుడు, డక్కిలి జడ్పీటీసీ మాజీ సభ్యురాలు కె.రాజేశ్వరమ్మ, ఎంపీపీ గోను రాజశేఖర్, టీడీపీ సీనియర్ నాయకులు సత్యం, పప్పు చంద్రమౌళిరెడ్డి, సి.సి.నాయుడు, రాయి మస్తాన్ నాయుడు, డక్కిలి తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్ఐ చౌడయ్య, మండల పరిత్ సిబ్బంది నివాళి అర్పించిన వారిలో ఉన్నారు.

వెంకటరెడ్డి మృతి వార్త వినగానే దిగ్భాంతి చెందా.... డక్కిలి మాజీ ఎంపీపీ పోలంరెడ్డి వెంకటరెడ్డి మృతి వార్త తనని దిగ్భ్రాంతికి గురిచేసిందని మాజీ ఎంపీ, సినీనటి ఊర్వశి శారద అన్నారు. బుధవారం ఆమె ఫోన్‌లో ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ... 2004లో వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను పోటీ చేశానని, ఆ సందర్భంగా వెంకటరెడ్డి వ్యక్తిత్వం తనను ఎంతగానో స్ఫూర్తి కలిగించిందన్నారు.


వెంకటరెడ్డి (ఫైల్‌ఫొటో)


నివాళులర్పిస్తున్న కురుగొండ్ల, సోమిరెడ్డి తదితరులు

స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దాం


అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న ఆర్డీవో కిరణ్‌కుమార్

గూడూరు, ఆగస్టు 14: స్థానిక ఏఏరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో గురువారం నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవాలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని ఆర్డీవో కిరణ్‌కుమార్ దిశానిర్దేశం చేశారు. బుధవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో గూడూరు, నాయుడుపేట డివిజన్ పరిధిలోని వివిధ శాఖల అధికారులతో జెండా పండుగపై సమీక్షించారు. ఈ ఏడాది 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ జాతీయజెండాను ఆవిష్కరిస్తారన్నారు. వివిధ శాఖలకు చెందిన పది శకటాలతో ప్రదర్శన ఉంటుందన్నారు. 16 కళాజాతా, కేరళ బృందాలు, విద్యార్థుల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలుంటాయన్నారు. ఈ వేడుకల్లో గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి, సత్యవేడు ఎమ్మెల్యేలు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రమణకుమార్, వివిధశాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎల్లుండి ఉచిత క్యాన్సర్ వైద్యశిబిరం

గూడూరు అర్బన్, ఆగస్టు 14: స్థానిక అశోక్‌నగర్‌లోని కేవీఆస్పత్రి వద్ద ఈనెల 17న క్యాన్సర్ ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి నిర్వాహకులు పేర్కొన్నారు. శిబిరంలో ఒంగోలుకు చెందిన క్యాన్సర్ వైద్యనిపుణుడు ప్రదీప్‌కుమార్‌రెడ్డి పాల్గొని వైద్యపరీక్షలు నిర్వహిస్తారన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవానికి సర్వం సిద్ధం

గూడూరు, ఆగస్టు 14: స్థానిక అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో గురువారం నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవాలకు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేపట్టారు. మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సుభాస్ చంద్రబోస్ సైకత శిల్పాలాలను సైకత శిల్పి సనత్‌కుమార్ రూపొందించడం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఈ వేడుకలకు హాజరయ్యే విద్యార్థులకు, ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సహకారంతో ఏర్పాట్లును పూర్తి చేశారు. వివిధ శాఖలకు చెందిన స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించడానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. సబ్‌కలెక్టర్, తహసీల్దారు కార్యాలయాలను విద్యుద్దీపాలకరణతో అలంకరించారు.



స్టేడియంలో చేపడుతున్న ఏర్పాట్లు - విద్యుత్‌దీపాలతో అలంకరించిన సబ్‌కలెక్టర్ కార్యాలయం

టిప్పర్ ఢీకొని కూలిన సెంటర్ లైటింగ్ పోల్


స్తంభం కూలడంతో ఇబ్బంది పడుతున్న వాహన చోదకులు

గూడూరు అర్బన్, ఆగస్టు 14: స్థానిక కోర్టుసెంటర్ వద్ద బుధవారం వేకువజామున కంకర లోడుతో వెళుతున్న టిప్పరు ఢీకొనడంతో సెంటర్ లైటింగ్ పోల్ కూలిపోయింది. చెన్నూరు నుంచి గూడూరు వైపుకు కంకరతో వెళ్తున్న టిప్పరు అదుపుతప్పి కోర్టు సెంటర్‌లోని సెంటర్‌లైటింగ్ పోల్‌ను ఢీకొనింది. దీంతో స్తంభం నేలకొరిగింది. విద్యుత్ తీగలు తెగి రోడ్డుపై పడ్డాయి. వేకువజాము కావడం, ఆ సమయంలో జనసంచారం లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ట్రాన్స్‌కో అధికారులు సరఫరా నిలిపివేసి మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

భారీ వాహనాలు పట్టణంలోకి రాకుండా చర్యలు తీసుకోండి: సీపీఐ

గూడూరు, ఆగస్టు 14: భారీ వాహనాలు పట్టణంలో రాకపోకలు సాగించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్ కోరారు. సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో అధికలోడు వాహనాల రాకపోకల కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందన్నారు. స్థానిక కోర్టుసెంటర్ కూడలి వద్ద కంకర లోడు టిప్పరు లైటింగ్ పోల్‌ను ఢీకొనడంతో స్తంభం విరిగి పోయిందన్నారు. జనసంచారం లేక పోవడంతో పెను ప్రమాదం తప్పిందన్నారు. భారీ వాహనాలను పట్టణం గుండా రాకపోకలు సాగించకుండా ప్రత్యామ్నాయ మార్గాలను చూపి ప్రమాదాలు జరకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీవీఆర్‌కుమార్, శశికుమార్, నారాయణ, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే దేశ భక్తి చాటుకోవాలి: విజయశ్రీ




సూళ్లూరుపేటలో జరిగిన ర్యాలీలో ఎమ్మెల్యే తదితరులు - నాయుడుపేటలో జరిగిన హర్ ఘర్ తిరంగా ర్యాలీ - ఓజిలో సీనియర్ సిటిజన్‌కు సన్మానం

సూళ్లూరుపేట, ఆగస్టు 14: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ దేశభక్తి చాటుకోవాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో జరిగిన హర్ ఘర్ తిరంగా ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా పట్టణంలోని హోలిక్రాస్ సర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండు సెంటర్ వరకు త్రివర్ణ పతాకాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండు సమీపంలో ఉన్న గాంధీజీ, అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ ముందుకుసాగాలన్నారు. ప్రతి ఇంటా జెండా ఎగురవేయాలని తెలిపారు. అదే విధంగా స్థానిక వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్‌సీసీ క్యాడెట్స్, విద్యార్థులచే డిగ్రీ కళాశాల నుంచి షార్ బస్టాండు వరకు జెండాలతో ర్యాలీ నిర్వహించారు.


వెంకటగిరి మోడల్ స్కూల్ విద్యార్థుల ర్యాలీ

ఆయా కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు టి.సుధాకర్ రెడ్డి, ఏ.రమేష్, ఏజీ కిషోర్, పెరుమాల్, వి.రమేష్, మాధవనాయుడు, నాపా మునిరాజా, ఏ.శ్రీనివాసులు, బీజేపీ నాయకులు ఆదినారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- వెంకటగిరి టౌన్: 78వ స్వాతంత్ర దినోత్సవాల్లో భాగంగా ఏపీ మోడల్ స్కూల్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ బుధవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ తులసి జ్యోతి, పాఠశాల ఉపాధ్యాయులు హరీష్ కుమార్, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.
- ఓజిలి: మండలంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా వెంకటరెడ్డిపాళెంనకు చెందిన సీనియర్ సిటిజన్ వి.సుందరయ్యను అధికారులు ఘనంగా సన్మానించారు. తహసీల్దారు పద్మావతి, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.
- పెళ్లకూరు: మండలంలోని నెలబల్లిలో బీజేపీ మండల అధ్యక్షుడు జి.మురళి ఆధ్వర్యంలో జాతీయజెండాలతో ర్యాలీ నిర్వహించారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నరసింహులు పాల్గొన్నారు.
- నాయుడుపేట టౌన్: టీఎంఆర్ విద్యాసంస్థల విద్యార్థుల ఆధ్వర్యంలో నాయుడుపేట పట్టణంలోని పోలేరమ్మ గుడి నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ జరిగింది. టి.మనోహర్‌రెడ్డి, సురేంద్ర, రాజశేఖర్‌రెడ్డి, కె.సుబ్రహ్మణ్యం, సుందరరావు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

తప్పుచేసిన వారికి శిక్ష తప్పదు

- టీడీపీది ఎప్పటికీ అంబేడ్కర్ రాజ్యాంగమే
- ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్


రాజగోపాల్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

వాకాడు, ఆగస్టు 14: తప్పు చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ స్పష్టం చేశారు. వాకాడు మండల అధికారులతో బుధవారం సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి నివాసంలో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. వైసీపీ భావజాలం ఉన్న అధికారులు ఇప్పటికైనా మారాలని సూచించారు. పేదోళ్ల ఓట్లతోనే ఎమ్మెల్యేగా గెలిచానని, సర్పంచ్‌గా కూడా గెలవలేని ఓ నేత సలహాలు తీసుకోనన్నారు. వాకాడు, కోట మండలాల్లో భూ ఆక్రమణలు జరిగాయన్నారు. ఆక్రమిత భూములను తిరిగి పేదలకు ఇప్పి స్తామన్నారు. గూడూరు నియోజకవర్గానికి రూ.10 కోట్ల ఉపాధి నిధులు వచ్చాయన్నారు. ఇటీవల వరద ప్రవాహానికి బాలిరెడ్డిపాళెం వద్ద దెబ్బతిన్న స్వర్ణముఖినది పొర్లుకట్టలను రూ.1.70 కోట్లతో మరమ్మతులు ప్రారంభించామన్నారు. మండలంలో 50 మినీ గోకులాలకు పేద రైతులు నమోదు చేసుకోవాలన్నారు. ఇటీవల మృతి చెందిన టీడీపీ కుటుంబాలైన సిద్ధిగుంటపాళెం గ్రామానికి చెందిన ఆర్.రామచంద్రయ్య కుటుంబాన్ని, పూడిరాయదొరువుకు చెందిన రాజగోపాల్‌రెడ్డి కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు డి.మధుసూదన్‌రెడ్డి, పి.పురుషోత్తమరెడ్డి, ఎస్.ప్రసాద్‌రెడ్డి, టి.మోహన్‌నాయుడు, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురేష్‌చౌదరి, ఎంఈవో నసీం అలీ ఉన్నారు.

కోట: నియోజకవర్గంలో వివిధ విద్యాలయాలను తీసుకువచ్చి శారదా పీఠాలుగా మార్చాలన్నదే లక్ష్యమని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ చెప్పారు. మండల పరిధిలోని చెందోడులో బుధవారం పాశం సునీల్ కుమార్ టీడీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ నాయకులు డి.మనోజ్‌కుమార్‌రెడ్డి, పి.సుధాకర్‌రెడ్డి, బాలసుబ్రహ్మణ్యం, మస్తాన్‌బాషా, గిరిరాజ్, రఘురామయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు.

ఇస్రో ఛైర్మన్ ఆధ్వర్యంలో నేడు షార్‌లో స్వాతంత్ర్య దిన వేడుకలు

సూళ్లూరుపేట, ఆగస్టు 14: సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో ఈ సారి స్వాతంత్ర్య దినోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీహరికోటలోని అంతరిక్ష కేంద్రీయ పాఠశాల మైదానంలో జరిగే ఈ వేడుకలకు ఇస్రో ఛైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ కూడా విచ్చేయనున్నట్లు షార్ అధికారులు తెలిపారు. సాధారణంగా షార్ డైరెక్టర్ చేతుల మీదుగా జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారు. ఈ సారి అంతరిక్ష దినోత్సవాలతో పాటు రాకెట్ ప్రయోగం కూడా ఉండడంతో ఇస్రో ఛైర్మన్ విచ్చేసి జెండా ఎగురవేసి ప్రసగించనున్నారు. ఇస్రో ఛైర్మన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దిన వేడుకలు నిర్వహించడం ఇదే తొలిసారి కావడం విశేషం.

షార్ చేరిన రాకెట్ పరికరాల వాహనం..



శ్రీహరికోట నుంచి రాకెట్ ప్రయోగాలకు వినియోగించే పరికరాలను బుధవారం రాత్రి అత్యంత భారీ భద్రత నడుమ ప్రత్యేక వాహనంలో తీసుకెళ్లారు. తమిళనాడులోని మహేంద్రగిరి నుంచి రోడ్డు మార్గానా సీఐఎస్ఎఫ్, పోలీసుల బందోబస్తు నడుమ షార్‌కు తీసుకెళ్లారు.

భూసమస్యలను పరిష్కరించండి

పెళ్లకూరు, ఆగస్టు 14 : మండలంలో భూ రీసర్వే రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించాలని తహసీల్దార్‌ను సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం కోరారు. తహసీల్దార్‌గా ద్వారకానాథ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో సమగ్ర విచారణ చేపట్టి భూసమస్యలు పరిష్కరించాలని కోరారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ రఫి, సర్పంచు డి.నాగేంద్రప్రసాద్‌రెడ్డి, వీఆర్వో రమేష్ తదితరులు ఉన్నారు.

ఓజిలి ఎంపీడీవోగా రజనీకాంత్

ఓజిలి, ఆగస్టు 14: ఎంపీడీవోగా రజనీకాంత్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీల్లో ఆయన చిత్తూరు జిల్లాకు వెళ్లారు. ఈక్రమంలో తిరిగి ఆయన్ను ఇక్కడ ఎంపీడీవోగా నియమించడంతో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది, కార్యదర్శులతో సమావేశమయ్యారు.

ఎన్‌బీకేఆర్‌లో ఓరియంటేషన్

కోట, ఆగస్టు 14: మండలంలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం మొదటి సంవత్సరం ఇంజనీరింగ్‌లో ప్రవేశం పొందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఓరియంటేషన్ జరిగింది. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ... క్రమశిక్షణతో కూడిన విద్య అవసరమన్నారు. తమ కళాశాలకు నాక్, ఎన్‌బీఏ గుర్తింపు ఉన్నాయన్నారు.

కూలిన బిల్డింగ్ సన్ షేడ్: తృటిలో తప్పిన ప్రమాదం



సూళ్లూరుపేట, ఆగస్టు 14: పట్టణం లోని కచ్చేరి వీధిలోని కూరగాయల మార్కెట్ సందులో కాలం చెల్లిన బిల్డింగ్ సన్ షేడ్ బుధవారం సాయంత్రం 6.30 గంటల కూలింది. ఆ సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. పక్కనే నిలిపి ఉన్న రెండు మోటరు సైకిళ్లు ధ్వంస మయ్యాయి. కాలం చెల్లిన భవనానికి సంబంధించి యజమానికి మున్సిపాలిటీ అధికారులు నోటీసులు అందజేసి ఉన్నారు.

మంత్రి సత్యకుమార్‌ను కలిసిన బీజేపీ నాయకులు

నాయుడుపేట, ఆగస్టు 14: రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి వై సత్యకుమార్‌ను ఎస్సీ మోర్చ రాష్ట్ర మాజీ కార్యదర్శి విజయభాస్కర్, జిల్లా మాజీ కార్యదర్శి ఆశ చెంచుకృష్ణయ్య కలసి మాట్లాడారు.